'పది' పరీక్షలకు.. 91.60 శాతం హాజరు

కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు



ఏలూరులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఏలూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఒకింత ఎండల తీవ్రత నడుమ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు జిల్లాలో మొత్తం 25,179 మంది బాల బాలికలు దరఖాస్తు చేసుకోగా 23,064 మంది (91.60 శాతం) హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదన్నారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ తీరుపై పాఠశాల విద్య డైరెక్టర్, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఆరా తీశారు. ఏలూరులోని సెయింట్ థెరిస్సా బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంతో పాటు, భీమడోలు వైపు వున్న 8 సీ-కేటగిరీ సెంటర్లను జిల్లా పరిశీలకుడు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. నగరంలోని కేపీడీటీ హైస్కూలు పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి సందర్శించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశారు. కొన్నిచోట్ల ఓఎంఆర్ షీట్లపై పరీక్షార్థుల పేర్లు తప్పుగా రావడంతో బ్లాంక్ ఓఎంఆర్ షీట్లను అందజేసి పరీక్ష రాయించినట్టు సమాచారం. పరీక్ష కేంద్రాల్లోకి కేవలం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే సెల్‌ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించిన నేపథ్యంలో, అక్కడ విధులు నిర్వర్తించే మిగతా సిబ్బంది పోలీసు, విద్య, ఆరోగ్యశాఖ, తదితర శాఖల సిబ్బంది పరీక్ష సమయం పూర్తయ్యే వరకు సీఎస్ వద్ద డిపాజిట్ చేసిన ఫోన్లను తీసుకునేందుకు అవకాశం లేకపోవడంతో అసహనానికి గురైనట్టు తెలిసింది.



ఏలూరు సెయింట్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, డీఈవో వెంకట లక్ష్మమ్మ

కాగా పదో తరగతి పరీక్షార్థుల కోసం రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ముద్రించిన లాంగ్వేజెస్, నాన్-లాంగ్వేజెస్ మోడల్ ప్రశ్నపత్రాల్లో ఉదహరించిన ప్రశ్నవళి నుంచి సోమవారం జరిగిన తెలుగు పరీక్ష (01టి)లో మొత్తం 47 మార్కులకు సంబంధించి ప్రశ్నలు వచ్చాయి. ఈ విషయాన్ని ఉపాధ్యాయ వర్గాలు ధ్రువీకరించాయి. మరోవైపు జడ్పీ నిధులతో జిల్లా విద్యాశాఖ ముద్రించిన 'విజయకేతనం' స్టడీ మెటీరియల్‌లో పేర్కొన్న ప్రశ్నల నుంచి 56 మార్కులకు ప్రశ్నలు తెలుగు పరీక్షలో వచ్చినట్టు ఉపాధ్యాయులు వివరించారు. ఈ రెండింటినీ ఎస్సీఈఆర్టీ, జిల్లా విద్యాశాఖ ఆయా సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించి, ముద్రించాయి. వీటిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అందజేశారు.



ఏలూరులో పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో మంచినీటి సమస్యలు, పారిశుధ్య సమస్యలు, ఇంటి పన్నులు, వీధి దీపాలు వంటి సమస్యలపై 19వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్ కార్యక్రమంలో డీపీవో కొడాలి అనురాధ పాల్గొంటారు. ప్రజలు **96663 08084** తెలిపితే వాటి పరిష్కారానికి డీపీవో చర్యలు తీసుకుంటారు.



ఫిర్యాదు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం : ఏఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఫిర్యాదును తక్షణమే క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరిస్తామని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 54 మంది ఫిర్యాదుదారుల నుంచి ఏఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. కాగా ఫిర్యాదుదారులకు ఏలూరు సత్యసాయిసేవా సమితి సహకారంతో ఉచిత భోజన సదుపాయం కల్పించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరురూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు అర్జీలు రీ ఓపెన్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజుతో కలిసి అర్జీలు స్వీకరించారు. సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్క రిస్తామని భరోసా ఇచ్చారు. మొత్తం 318 అర్జీలు స్వీకరించారు.

చెయ్యని పనులకు బిల్లులు.. సర్పంచ్ ఖాతాలోకి నిధులు

కలెక్టర్‌కు వార్డు సభ్యుడి ఫిర్యాదు



జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం పంచాయతీలో పారిశుధ్య పనులు, డ్రెయిన్‌లో పూడిక పనులు, చెత్త రిక్షాలు తిరగకుండా కొన్ని నెలలుగా చెయ్యని పనులకు చేసినట్టు చూపి బిల్లులు పెట్టి పంచాయతీ నిధులను సర్పంచ్ తన ఖాతాలోకి మళ్లించుకున్నారని విచారణ చేసి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ ఆ పంచాయతీ వార్డు సభ్యుడు పి.ధర్మరాజు, మోటమర్రి వెంకటలక్ష్మి జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇందుకు సహకరించిన సిబ్బందిపై, సర్పంచ్‌పై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకుల నిరసన

తెలుగును ఐచ్ఛికం చేయొద్దు

ఏలూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్య సంస్కరణల్లో భాగంగా ద్వితీయభాష తెలుగును ఐచ్ఛిక (ఆప్షనల్) సబ్జెక్టుగా మార్చేందుకు ఇంటర్‌బోర్డు చేస్తున్న యత్నాలను నిరసిస్తూ సోమవారం ఏలూరులో ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో ఎగ్జామినర్లు (జూనియర్ లెక్చరర్లు) నిరసన తెలిపారు. ఏపీ తెలుగు అధ్యాపకుల సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా చదవాల్సిన తెలుగు సబ్జెక్టును ఆప్షనల్‌గా చేయడం వల్ల తెలుగుభాష మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భాషల పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుభాషను ఐచ్ఛికం చేయడమంటే తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టడమేనని, తెలుగుభాషను కాపాడాలని కోరా రు. స్పాట్ కేంద్రంలో తెలుగు జవాబుపత్రాలు దిద్దే జూనియర్ లెక్చరర్లు సమావేశమై ప్రభుత్వ యత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పాట్ ప్రాంగణంలోనే వున్న ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో కార్యాలయం వద్ద నినాదాలు చేసి ఆర్‌ఐవో కె.యోహాన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

నేటి నుంచి మినుములు, పెసలు కొనుగోలు కేంద్రాలు

జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో మినుములు, పెసలు (అపరాలు) కొనుగోలు కేంద్రా లు నేటి నుంచి ప్రారంభిస్తున్నట్టు జేసీ ధాత్రిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదపాడు, వట్లూరు, డీసీఎంఎస్ ఏలూరు, జాలిపూడి, దెందులూరు సొసైటీలలో పెసలు కొనుగోలు కేంద్రాలు, లింగాల, దేవపూడి, తామరకొల్లు , ఏలూరు డీసీఎంఎస్, దెందులూరు, అప్పన్నవీడు డీసీఎంఎస్, పెదపాడు, వెంకటాపురం సొసైటీల్లో మినుములు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు తమకు కేటాయించిన తేదీ ప్రకారం కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి తమ పంటను విక్రయించుకోవాలన్నారు. క్వింటాల్ పెసలుకు మద్దతు ధర రూ.8,682, మినుములకు రూ.7,400 చెల్లించి కొనుగోలు చేస్తారన్నారు. నగదు రైతుల బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. వివరాల కోసం సంప్రదించాల్సిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, శ్రీకాంత్, సెల్ నెంబరు : 91009 55934, కంట్రోల్ రూమ్ నెంబరు- 77020 03584లో సంప్రదించవచ్చన్నారు.

నేడు నాలుగు మండలాల్లో వేడిగాలులు

ఈనెల 18వ తేదీ మంగళవారం జిల్లాలోని నాలుగు మండలాల్లో మాత్రమే వేడిగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం, వేలేరుపాడు మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. పశ్చిమ గోదావరి జిల్లాలో వేడిగాలులు వీచే అవకాశాలు లేవని పేర్కొంది.

రూ.లక్షన్నర కొట్టు.. ఉద్యోగం పట్టు!

అభ్యర్థులు ఏలూరులోని వివిధ పాఠశాలల్లో చదవగా, ఉద్యోగాల నిమిత్తం డీఎం హెచ్‌వో కార్యాలయానికి అందజేసిన విద్యార్హతల సర్టిఫి కెట్లలో తాడేపల్లిగూడెం, తది తర ప్రాంతాల్లోని పలు పాఠ శాలల్లో చదివినట్టు సృష్టిం చడంతోపాటు, మార్కులను ఒక్కొ క్కరు 500లకు పైగా సాధించినట్టు క్రియేట్ చేసి 'కృత్రిమ మెరిట్'తో మిగతా అభ్యర్థులకంటే ముందు వరుసలో ఉంచినట్టు ప్రచా రం జరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో కొందరు వైసీపీ స్థానిక నాయ కుల ప్రమేయం ఉన్నట్టు సమాచారం.

- మార్కులు తక్కువ వచ్చినా పర్వాలేదు.. నకిలీ సర్టిఫికెట్లు మేమే సృష్టిస్తాం..!
- వైద్య ఆరోగ్య శాఖలో కొందరు ఉద్యోగుల దందా.. వైసీపీ నేతల ప్రలోభాలు..
- లక్షలు సమర్పించుకున్న అభ్యర్థులు.. ప్రజా స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు



ఏలూరు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఈ ఏడాది జనవరి 22న డీఎంహెచ్‌వో పేరిట వెలువడిన నోటిఫికేష న్‌లో కాంట్రాక్టు విధానంలో పది ల్యాబ్ టెక్నీషి యన్, ఔట్‌సోర్సింగ్ విధానంలో 30 ఫిమేల్ నర్సిం గ్ ఆర్డర్లీ (ఎఫ్ఎన్‌వో) ఉద్యోగ ఖాళీల భర్తీకి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. అర్హతల వివరాలను నోటిఫికేషన్‌లోనే పేర్కొ న్నారు. వాస్తవానికి ఈ ఉద్యోగాల భర్తీ గత నెలలోనే పూర్తికావలసి ఉంది. ఈ లోగా ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి రావడంతో అడ్డంకి ఏర్పడింది. ఈ క్రమంలో దొడ్డి దారిన ఉద్యోగాలను పొందటానికి కొందరు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి, ఆశావహుల నుంచి ఒక్కో ఉద్యోగానికి లక్షన్నర ధర పెట్టారు. మొత్తం 18 మంది ఉద్యోగార్థులు ఈ గ్రూపులోని వ్యక్తులకు అడ్వాన్స్‌గా రూ.50 వేలు ఇచ్చేశారు. మిగతా మొత్తంలో కొంత భాగాన్ని మెరిట్ లిస్టు ఖరారయ్యాక, మిగతా పూర్తి మొత్తాన్ని ఉద్యోగ నియామక పత్రం జారీ అయ్యాక ఇచ్చేలా షరతు పెట్టారు. ఈ నేపథ్యంలో తమకు డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు వచ్చేలా చేయడానికి డీఎం హెచ్‌వో కార్యాలయంలో కొందరిని దారిలోకి తెచ్చు కున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఉద్యోగార్థుల సంఖ్య భారీగా ఉండటంతో దొడ్డి మార్గంలో ఉద్యోగ సాధనకు విద్యార్హతలకు సంబం ధించి నకిలీ సర్టిఫికెట్లను ఎంచు కున్నారు. తమకు డబ్బు లిచ్చిన 18 మంది అభ్యర్థు లకు విద్యార్హతల నకిలీ సర్టిఫికెట్లను తయారు చేసి, వాటి ఫొటో స్టాట్ కాపీలనే దరఖాస్తులకు జత చేసి సమర్పించారు. అప్పటికే డీఎంహెచ్‌వో కార్యాలయంలో లాలూచీ చేసుకున్న కొందరు ఉద్యోగుల సహకారం ఉండటంతో సంబంధిత నకిలీ విద్యార్హతల సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల పేర్లు ప్రొవిజనల్, ఫైనల్ మెరిట్ లిస్టుల దశలను దాటుకుని డీఎంహెచ్‌వో అనుమతితో, జిల్లా సర్వోన్నతాధికారి తుది ఆమోదముద్ర నిమిత్తం వెళ్లిపోయింది. ఇక తుది అనుమతులు వచ్చిన వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు జారీ చేయడమొక్కటే మిగిలింది. ఈ అక్రమ వ్యవహారా న్ని డీఎంహెచ్‌వో దృష్టికి రాకుండా కార్యాలయ ఉద్యోగులు కొందరు నడిపించారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందటానికి కొందరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులమారినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అక్రమ దందా వెనుక డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారం సోమవారం కలకలాన్నే సృష్టించింది.

ఈ అక్రమాల దందాపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా స్పందనలో ఏలూరు వెంక టాపురం వినాయకనగర్‌కు చెందిన సీహెచ్ అర్జునరావు ఫిర్యాదు చేయగా, అక్కడికక్కడే స్పందించిన కలెక్టర్ నేరుగా డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని పిలిచి తక్షణమే ఈ నియామకాలపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదును పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశిం చారు. దీనిపై వివరణ కోసం డీఎం హెచ్‌వో డాక్టర్ మాలినిని సోమవారం రాత్రి ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

ఏజెన్సీలో వైద్య సదుపాయాలు మెరుగు పరచాలి



పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి, మార్చి, 17: (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో వైద్య సదుపాయాలు మెరుగు పరచాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. సరైన వైద్య సదుపాయాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో పలు వైద్య కేంద్రాల నిర్మాణాలు ప్రారంభించి బేస్‌మెంట్ స్థాయిలో నిలిపివేశారన్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మించి పలు మండలాల్లో నిపుణులైన వైద్యులను నియమించాలని కోరారు.

7

మే 7 నుంచి ట్రిపుల్ ఐటీకి సెలవులు

ముగిసిన ఏపీపీఎస్సీ పరీక్షలు

పశు బీమా అమలు

- వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- పునరుద్ధరించిన టీడీపీ ప్రభుత్వం



వైభవంగా కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ

జంగారెడ్డిగూడెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామచంద్రపురంలో కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ, దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని కోదండ రాముడిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. సుమారు ఆరు వేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన జరిపారు. పూజా కార్యక్రమాల్లో తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాల్గొనగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కమిటీ గౌరవ అధ్యక్షులు పరిమి ధర్మరాజు, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, కమిటీ అధ్యక్షుడు మోతుకూరి నారాయణరావు వరికూటి ధర్మారావు, పాకనాటి అంజిబాబు, రాంబాబు, రఘురామ్, సురేష్, శ్రీనివాస్, విజయ రవీంద్రబాబు, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పునః ప్రతిష్ఠించిన దేవతా మూర్తుల విగ్రహాలు

వివాహితపై ఇద్దరు అత్యాచారం

కేసు నమోదు చేయని పోలీసులు.. ఐజీకి ఫిర్యాదు

ఏలూరు క్రైం, మార్చి 17(ఆంధ్ర జ్యోతి):తనపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడులకు పాల్పడి, వీడియోలు తీసి వేధి స్తున్నారని.. ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోగా, తిరిగి కౌంటర్ కేసు వేస్తామని బెదిరిస్తున్నారని బాధితురాలు, కుటుంబ సభ్యులు సోమవారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాలివి. ఉండి మండలానికి చెందిన ఓ వివాహితపై అదే మండలం ఎస్ఆర్పీ అగ్రహారానికి చెందిన యర్రంశెట్టి రవి, గుబ్బల సోమేశ్వరరావు (సోము) వేధిస్తూ లైంగిక దాడికి పాల్పడ్డారని, ఆ తర్వాత బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ బీచ్‌కు, భీమవరంలోని స్నేహితుల రూముకు తీసుకెళ్లి లైంగికదాడి జరిపారని ఆరోపించారు. ఆ తర్వాత తనను బెదిరించి దఫదఫాలుగా రూ. రెండున్నర లక్షలు తీసుకుని, మళ్లీ డబ్బు కావాలని వేధిస్తున్నారన్నారు. వేధింపులు భరించలేక ఈ నెల 1న ఉండి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. నిందితులపై చర్యలు తీసుకోకపోగా రాజీ చేసుకోవాలని, లేకుంటే తనపైన, తన భర్త, మరిదిపైన కౌంటర్ కేసు పెడతామని పోలీసులే బెదిరిస్తున్నారని వాపోయింది. ఈ క్రమంలో బాధితురాలు, కుటుంబ సభ్యులు, రజక సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య ఐజీని కలిసి వినతిపత్రం అందించారు. ఐజీ స్పందిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీని విచారణ అధికారిగా నియమించారని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని కట్లయ్య తెలిపారు. కె.మురళీకృష్ణ, యలమంచిలి శేషు, యండమూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో..



6

చింతలపూడి నగర పంచాయతీలో చెరువులు..కుంటలు కనుమరుగు



మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో హీరో నితిన్‌కు ప్రసాదం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు జవ్వాది కృష్ణ... గుబ్బల మంగమ్మతల్లి ని దర్శించుకున్న నితిన్

మద్ది ఆంజనేయునికి హీరో నితిన్ పూజలు

జంగారెడ్డిగూడెం/ బుట్టాయగూడెం మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయి గూడెం మద్ది ఆంజనేయస్వామిని సినీ హీరో నితిన్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఆలయ పర్య వేక్షకుడు జవ్వాది కృష్ణ స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందించారు. హీరో నితిన్‌తో పాటు మైత్రి మూవీస్ అధినేత రవి శంకర్, దర్శకుడు వెంకీ కుడముల పాల్గొన్నారు. గుబ్బల మంగమ్మతల్లికి సోమ వారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయం వద్ద ఉన్నవారు నితిన్ చూసేందుకు ఎగబడ్డారు.

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ1.75 కోట్లు



ద్వారకాతిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న హుండీల లెక్కింపు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 18 రోజుల కాలానికి గాను జరిగిన ఈ లెక్కింపులో శ్రీవారికి నగదు రూపేణా రూ.1.75 కోట్ల రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో ఎన్వీ సత్యనా రాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో సోమవారం భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా 1,75,65,133 రూపాయల నగదుతో పాటు కానుకల రూపేణా 137 గ్రాముల బంగారం, 3.1305 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (13), 1000(5) 2000 (3)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం లభించింది.

భీమవరంలో హోరాహోరీగా టెన్నిస్ పోటీలు



భీమవరం అర్బన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) :భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతున్న ఆలిండియ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. 5 విభాగా లలో జరిగిన పోటీలలో విజేతలుగా వీరు ఉన్నారు. 35+సింగిల్స్ విజేతలుగా గణష్ హోసన్న, ఆశోక్‌రెడ్డి, నాగరెడ్డి, నితీష్ జాక్సన్,డా. అశ్విన్ కుమార్‌లు నిలిచారు. 45+విభాగంలో కే సంపత్, గంజీ వెంకటేశ్వర్లు, ఎంఎస్ కిరణ్, శివకుమార్‌రాజు, సుబ్రమనియన్ గోపాల కృష్ణ, విజయం సాధించారు. 55+సింగిల్స్‌లో ఆయుదే సిష్, రాత్, కోటేశ్వరరావు కుంబా, బాబు రాజన్, మణికంధన్, రెడ్డి రామకృష్ణలు నిలిచారు. 65+ విభాగంలో శ్రీనివాస్ రెడ్డి, రంజిత్‌లంకా, పాల్ చంద్రా, ధనాంజనేయులు, గెలుపొందారు. 70+ విభాగంలో సెటు, బీఎల్ఎన్ రాజు, బీజీ రెడ్డిలు విజేతలుగా నిలిచారని టెన్నిస్ అసోసి యేషన్ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు తెలిపారు.

కుక్కునూరు-భద్రాచలం రహదారి పనులు ప్రారంభం



కుక్కునూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు భద్రాచలం రహదారి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. కుక్కు నూరు, భద్రాచలం, అశ్వారావుపేట 40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి దాదాపు రూ.36 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులు ప్రారంభం కాగా సాంకేతిక లోపం కారణంగా దాదాపు మూడేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. 40 కిలోమీటర్ల మేర రహ దారి తవ్వి వెట్‌మిక్స్‌ను వేశారు. అయితే చేసిన పనికి దాదాపు ఏడు న్నర కోట్లు బిల్లు రావల్సి ఉంది. బిల్లు రాకపో వడంతో నాలుగు నెలలుగా సంబంధిత కాంట్రాక్టరు పనులు నిలిపివేశాడు. ఇదే సమయంలో సదరు కాంట్రా క్టర్‌కి తెలం గాణలో చేసిన పనికి గానూ బిల్లు రావడంతో ప్రస్తుతం మళ్లీ కుక్కునూరు, భద్రా చలం రహ దారి పనులు ప్రారంభించినట్లు సమాచారం.

విద్యా గణపతికి పెన్నులతో అలంకారం



భీమవరం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :పదో తరగతి పరీక్షలు పురస్కరించుకుని విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ సోమవారం గునుపూడి ఉమా సోమేశ్వర భీమవరం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో విద్యా గణపతికి పెన్నులతో అలంకారం చేశారు. దాతలు వేలూరి శ్రీధర్, మాదిరెడ్డి శ్రీనివాసులు అందించిన పెన్నులు,పెన్సిళ్లు, స్కేళ్ళతో స్వామివారిని అలంకరించారు. అనంతరం విద్యార్థులకు అందించారు. అధ్యక్షుడు వేలూరి సత్యహనుమ కిరణ్ చంద్రా, మారెళ్ళ అఖిలేష్, వేలూరి శేషగిరిరావు, మదిరి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



కబ్జా కోరల్లో..



వేగిలింగేశ్వరస్వామి చెరువు ఆక్రమించి నిర్మించిన కట్టడాలు

చెరువులు..కుంటలు కనుమరుగు

ఆక్రమించి నివాసాలు నిర్మాణం

పట్టించుకోని అధికారులు

ఇలా అయితే పర్యావరణానికి హాని

చింతలపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని చెరువులు ఆక్రమించి నివాస గృహాలు నిర్మిస్తుండగా కుంట చెరువులు కబ్జాలకు గురవు తున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ చెరువుల దిగువన సాగు విస్తీర్ణం లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. నగర పంచాయతీలో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఏడు చెరువులు, 18 కుంట చెరువులు ఉన్నాయి. ఇందులో నడిబొడ్డున ఉన్న మొహిద్దీన్‌కుంట చెరువు, వేగిలింగేశ్వరస్వామి చెరువు సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. వీటి దిగువన ఉన్న పంట భూములు భవన నిర్మాణాలతో నిండిపోయింది. సాగు భూమి ఎకరం కూడా లేదు. దీంతో చెరువులను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేశారు. చెరువు విస్తీర్ణం కుంచించుకుపోయింది. మేజర్ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి ఈ విధమైన నిర్మాణాలు జరుపుతున్నా పట్టించుకున్న అధికారి లేరు. నడిబొడ్డున ఉన్న మరో పెద్ద చెరువు ఆక్రమణలకు గురై కలుషిత మవుతోంది. ఈ చెరువులో ఇప్పటికే బ్యాక్ వాటర్‌లో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఇది ప్రజలకు ఉపయోగపడినా దీనిని ఆసరాగా తీసుకుని చెరువును పూడ్చి రియల్ ఎస్టేట్ దారి కోసం రోడ్డు కూడా నిర్మించారు. కళ్లకు కనిపిస్తున్నా నీటిపారుదల శాఖగాని, మునిసిపల్ అధికారులు గాని పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. బోయ గూడెం చెరువు కాలుష్యానికి గురవుతోంది. నగర పంచాయతీలో సుమారు తొమ్మిది వేల గృహాలు ఉన్నాయి. ఇళ్ల నుంచి వెళ్లే మురుగునీరు ఈ చెరువులు, కుంటల్లోకి వెళ్లి కాలుష్యానికి గురి చేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, కోళ్లవ్యర్థాలు ఈ చెరువు అంచుల్లో వదిలేస్తున్నారు. పట్టణంలో ఉన్న మిగిలిన చెరువులు తాడిబంధం చెరువు, ఈడిగాడిచెరువు, కొత్తచెరువుతో పాటు రావి కొయ్యికుంట, నాచుకుంట, మాదిగకుంట కబ్జాకు గురయ్యాయి. ఇంకా 15 కుంట చెరువులు కూడా సరిహద్దులు, రికార్డుల ప్రకారం కనిపిస్తున్నా ఇవి ఎక్కడ ఉన్నాయో రెవెన్యూ శాఖే తేల్చాలి. పెరుగుతున్న పట్టణ జనాభాకు వాహనాల నిలుపుదల కోసం, ప్రభుత్వ కార్యాలయాల కోసం ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా మునిసిపల్ పరిధిలో స్థలాల కొరత తీవ్రంగా ఉంది. నగర పంచాయతీలో ఇప్పటికే పార్కు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా చేపట్టలేదు. వేగిలింగేశ్వర స్వామి చెరువు గట్టునే సుందరీకరణ పేరుతో నిధులు ఖర్చు చేశారు. ఈ పథకం ఇప్పటివరకు ప్రారంభం కూడా కాలేదు. ఇక లారీలు, టాక్సీలు, మినీ వ్యానులు, ఆటోలు, విపరీతంగా పెరిగాయి. వీటిని రోడ్లపక్కనే నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. లారీ యజమానులు అసోసియేషన్ తరపున పలుమార్లు నగర పంచాయతీ, రెవెన్యూ అధికారులకు వాహనాల నిలుపుదలకు స్థలం చూపించాలని విజ్ఞాపనలు ఇచ్చారు. ఇంతవరకు వారికి స్థలాలు కూడా కేటాయించలేకపోయారు.పట్టణ శివారు మూడు కిలోమీటర్ల దూరంలో ఒక ప్రైవేటు భూమిని అద్దెకు తీసుకుని లారీలు నిలుపుదల చేసుకుంటున్నారు. ఈ చెరువులు, కుంటలు వాల్టా చట్టం ప్రకారం సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగిస్తే నీటి నిల్వ పెరిగి పర్యావరణ సమతుల్యం ఏర్పడుతుందని స్థానికులు కోరుతున్నారు.



మొహిద్దీన్‌కుంట చెరువులో ఆక్రమించి నిర్మించిన ఇళ్లు

మూడు కుంటలు కబ్జా చేసి పట్టాలు పుట్టించారు



నగర పంచాయతీలో చిన్నచిన్న కుంట చెరువులు ఆక్రమిస్తున్నారు. మూడు కుంటలను ఆక్రమించి పట్టాలను కూడా పుట్టించారు. కుంటలు, చెరువులు కాపాడుకుంటేనే పర్యా వరణం బాగుంటుంది. చెరువులు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేయాలి. ఒకప్పుడు ఈ చెరువుల్లో నీటినే మంచినీరుగా వినియోగించే వారు. ఇప్పుడు కలుషితమైన చెరువు చూస్తుంటే కళ్ల వెంట నీళ్లొస్తున్నాయి.

- టి.బాబు, సీపీఐ నాయకుడు, చింతలపూడి

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం



నగర పంచాయతీలో చెరువులు, కుంటలపై సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను కోరు తున్నాం. ప్రస్తుతం రీసర్వే కార్యక్రమాల వల్ల సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు. ఒకటి, రెండు నెలల్లో వీటిపై మరోసారి ఆ శాఖ దృష్టికి తెచ్చి వీటిపై సరిహద్దులు సర్వే చేయించి ఆక్రమణలు తొలగించి వీటిని కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటాం.

- డి.పావని, మునిసిపల్ కమిషనర్, చింతలపూడి

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కేసుల పరిష్కారానికి మధ్య వర్తిత్వం చక్కటి మార్గమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో న్యాయ వాదులకు ఐదురోజు పాటు శిక్షణా తరగతులను ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఏలూరు బార్ అసోసియేషన్ భవనంలో సోమ వారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారం భించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎంపికైన న్యాయ వాదులకు శిక్షణ ఇవ్వడం ద్వారా కక్షిదారులకు సేవలను మరింత త్వరితగతిన అందించే అవకాశం ఉంటుందన్నారు. కేసుల త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెండవ అదనపు జిల్లా జడ్జి మంగాకుమారి, ఐదవ అదనపు జిల్లా జడ్జి రాజేశ్వరి, డీఎల్ఎస్‌కె కార్య దర్శి రత్నప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్ పాల్గొన్నారు.

సీటీ స్కాన్‌కు సుస్తీ..!

క్షతగాత్రులను విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేస్తున్న ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు



ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ప్రమాద పరిస్థితిలో రోగులు వచ్చారంటే వారికి వైద్య సేవలు అందించకుండా సీటీ స్కాన్ పనిచేయడం లేదంటూ విజయవాడ, గుంటూరులకు రిఫర్ చేసేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ మిషన్లను ఎస్ఆర్ఐ సంస్థ నిర్వహిస్తోంది. ఈనెల 15వ తేదీ నుంచి సీటీ స్కాన్ మిషన్ పనిచేయడం లేదు. ఏదైనా రోడ్డు ప్రమాద బాధితులు ఆసుపత్రికి వచ్చారంటే వారికి తలకు దెబ్బ ఉందని తెలిపినా, శరీరంలో దెబ్బలు తగిలాయని చెప్పినా మరు క్షణమే ఇక్కడ సీటీస్కాన్ మిషన్ పని చేయడం లేదని విజయవాడ, గుంటూరుకు వెళ్ళి స్కానింగ్ చేయించు కోవాలని చెబుతున్నారు. వాస్తవానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న ఎక్స్‌రే ద్వారా ప్రాథమికంగా శరీరం లోపల ఉన్న గాయాలను గుర్తించ వచ్చు. కానీ సీటీస్కాన్ పనిచేయడం లేదని అసలు వైద్యం చేకుండానే పంపేస్తున్నారు. ఎంఆర్ఐ మిషన్ పనిచేస్తున్నది. అత్యవసర పరిస్థితుల్లో ఎంఆర్ఐ ద్వారా స్కాన్ చేసి వైద్య సేవలందించవచ్చు. ఇటీవల ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్‌లో జరిగిన ఆర్టీసీ ప్రమా దంలో క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వా సుత్రికి తీసుకురాగా వారిని 108 అంబులెన్సు నగరంలో ఉన్న ఓ ప్రైవేటు సీటీ స్కాన్ సెంటర్‌కు తరలించారు. జిల్లా ఉన్న తాధికారులు ఈ సమస్యను పరిష్కరించి ఆసుపత్రిలోనే సేవలందించాలని పలువురు కోరుతున్నారు.



చిగురు మేఘం నాటికలోని రసవత్తరమైన సన్నివేశం

ఆసక్తి రేకెత్తిస్తున్న నాటికలు

పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో

3వ రోజు 2 నాటికల ప్రదర్శన

పాలకొల్లు అర్బన్, , మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు కళాపరిషత్ 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ నాటికల పోటీల్లో మూడో రోజు సోమవారం రెండు నాటికలను ప్రదర్శించారు. చిగురు మేఘం, బ్రహ్మస్వరూపం నాటికలను ప్రదర్శించారు. ఆధునిక వైద్యం సామాన్యుడికి అందుబాటులో లేకపోవడం, డబ్బు సంపాదనే ధ్యేయంగా విలువలు కోల్పోయిన కార్పొరేట్ హాస్పటల్స్ తీరును విమర్శనాత్మకంగా వినూత్నంగా ప్రదర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిగ్రీ చేసిన తరువాత సామాన్యులకు సేవ చేస్తామని ప్రతిజ్ఞ చేస్తారు. కానీ ఓ కార్పొరేట్ ఆసుపత్రి అధిపతిని వివాహం చేసుకుని సంపాదనే ధ్యేయంగా ఉన్న డాక్టర్‌ని బీదరికంలో ఉన్న తల్లిదండ్రులు చాలా ఏళ్ళ తరువాత కలవడం, రోగాల పాలైన తల్లి డాక్టర్ చేతిలో చనిపోవడంతో డాక్టర్‌లో మార్పుకు బీజం పడుతుంది. డాక్టర్‌గా తాను చేసిన పనికి పశ్చాత్తాపపడి తన తల్లి వంటి వారు గ్రామాల్లో ఎందరో ఉన్నారని తెలుసుకుని గ్రామాల్లో వైద్యం చేయడానికి డాక్టర్ వెళ్ళడంతో కథ ముగుస్తుంది. గుంటూరు అమరావతి ఆర్ట్స్ ప్రదర్శించిన నాటికను కావూరి సత్య నారాయణ రచన చేయగా యేపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. విజయవాడ మైత్రి కళానిలయం వారి బ్రహ్మ స్వరూపం నాటికలో మంచితనం వికసిస్తున్నప్పుడు అందరూ మంచివారిగానే కనిపిస్తారు, మంచివారు ప్రపంచం చాలా గొప్పగా ఉంటుంది. ఆ ప్రపంచంలో మనకు ఆత్మీయతలు, అభిమానాలు, మమకారాలు, మాధుర్యాలు కనిపిస్తూంటాయి. స్వచ్ఛమైన అనుభూతులు చూడగలిగితే మనకు నచ్చిన జీవితం మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. అలాంటి ప్రభావంతో గుండెను తడిచేసే సంఘటనలు జ్ఞాపకాలుగా మిగిలిపోయే సందర్భాలు ఈ నాటికలో మనల్ని స్పృశిస్తాయి. కానీ ఒక్కోసారి అలాటి అహ్లాదకరమైన జీవి కఠినమైన సందర్భాలలో విధి విరోధిగా మారిన వేళల్లో మనం నిస్సాహాయులుగా మిగిలి పోతున్నప్పుడు సాక్షాత్తు ఆ బ్రహ్మ స్వరూపమే ఆవహించి, ధర్మాన్ని చెబుతుంది. ఈ కథ ముగింపు కూడా అదేవిధంగా ఉంటుంది. రచన శ్రీ స్నిగ్ధ కాగా పురుషోత్తం దర్శకత్వం వహించారు.



బ్రహ్మస్వరూపం నాటికలోని దృశ్యం

జీడిమామిడి ఎక్కడ?



అంతరించిపోతున్న జీడిమామిడి చెట్లు

తగ్గిన దిగుబడులు

పడిపోయిన సాగు విస్తీర్ణం

మొగల్తూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విదేశీ మారకద్రవ్యం ఆర్జించి పెట్టే పంట జీడి మామిడి. ఇసుక నేలలు, కొండప్రాంతాల్లో తేమ శాతం ఎక్కువగా ఉండే ఉష్ణమండల వాతావరణంలో ఈ తోటలు పెంపకానికి అనుకూల ప్రాంతాలు. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకూ కోస్తాతీరం వెంబడి ఈ తోటలు విస్తారంగా ఉండేవి. జీడి పంట నుంచి వచ్చే జీడిపప్పు వినియోగం పెరుగుతూ ఉండటంతో రైతు స్థాయిలో వర్షాధారంగా సాగుచేసే అవకాశం ఉన్నందున ఈ సాగు ఎక్కువ ఆదరణ పొందింది. అయితే ఇటీవల ఈ తోటల్లో యాజమాన్య లోపాల కారణంగా దిగుబడులు లేకపోవడం, జీడిపండుకు ధర లేకపోవడంతో పాటు జీడిపిక్కల దిగుబడి ఆశాజనకంగా లేదు. ఒకప్పుడు ఒక్కొక్క చెట్టుకు సుమారు 8 నుంచి 10 కిలోల పంట దిగుబడి వచ్చేది. ఇప్పుడు యాజమాన్య లోపాలు, సాగుపై రైతులకు అవగాహన లేక పోవడం వంటి కారణాలతో పాటు ఎక్కువ భూభాగాన్ని ఈ చెట్లు ఆక్రమించుకోవడం, జీడిపిక్కలు కోయడం, పెరిగిన కూలి ధరల కారణంగా పంట లాభదాయకంగా లేదు. ఒకప్పుడు విస్తారంగా ఉండే జీడితోటలు నేడు అంతరించిపోతున్నాయి. పశ్చిమ తీరంలో వచ్చే దిగుబడిని రాష్ట్రంలో గల 18 జీడిపప్పు ఫ్యాక్టరీలకు రైతులు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం జీడిగింజను ఎండబెట్టి ఒబ్బిడి చేసే పరిస్థితి లేకపోవడంతో పచ్చి జీడిగింజలనే విక్రయిస్తున్నారు. మార్చి నెల నుంచి మే నెల వరకూ ఈ జీడి పిక్కలు దిగుబడికి వస్తాయి. ప్రస్తుతం మొగల్తూరు మార్కెట్‌లో కిలో పచ్చి జీడి గింజలు రూ.180 నుంచి 200లకు విక్రయిస్తున్నారు. డిమాండ్ ఉన్న ఈ జీడి సాగును ప్రభుత్వ ప్రోత్సహించి రైతులకు నాణ్యమైన అంట్లను సరఫరా చేసి ఉపాధి హామీ పథకం నుంచి మొక్కలు నాటేందుకు, మొక్కలు పెంపకానికి, పంట కోయడానికి కూలీలను ఏర్పాటు చేస్తే పశ్చిమ తీరంలో ఈ సాగు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మొగల్తూరులోని జీడిమామిడి తోటలు

జీడిపండుతో ప్రయోజనాలు

వేసవి కాలంలో వచ్చే అధిక దాహార్తిని జీడి పండు నివారిస్తుంది. జీడిపండును తినడం వల్ల వేసవిలో శరీరంలోని చెమటి నుంచి వచ్చే జిగురు నివారణ కావడంతో శరీరంలోని అధిక వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వీటిని తినడం వల్ల దగ్గు, కఫం తగ్గి వేసవిలో మంచి ఆరోగ్యం కలుగుతుంది.

జీడిపప్పుతో ఆరోగ్యం

జీడిపప్పు తినడం వల్ల మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆందోళన, నిరాశ తగ్గిస్తుంది. జీడిపప్పులోని పోషకాలు రక్తంలో చక్కర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. జీడిపప్పులో ఉండే కాపర్, జింక్ రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. జీడిపప్పులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. గుండెకు ఆరోగ్యకరమైన కొవ్వును అందించడం, మెదడు ఆరోగ్యానికి తోడ్పడటం, బరువు నిర్వహణలో సహాయపడుతుంది.

భలే..భలే జీళ్లు



తిరునాళ్లలో ఇవి ఉండాల్సిందే..

సంప్రదాయంగా కొనసాగుతున్న వ్యాపారం

పెరిగిన ఖర్చులతో తగ్గిన అమ్మకాలు

తినేవారూ తగ్గిపోయారు

కనుమరుగవుతున్న జీళ్ల తయారీ

గణపవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జాతరలు, ఉత్సవాలు, తిరునాళ్లలో ప్రధానంగా దర్శనమిచ్చేవి జీళ్లే.. తియ్యతియ్యని, కమ్మని జీళ్ల తయారీ వ్యాపారం వంశ పారంపర్యంగా కొనసాగుతూ వస్తున్నది. గ్రామాల్లో ఏదైనా ఉత్సవం జరిగిందంటే చాలు ఇంటింటా జీళ్ళతో నోరుతీపి చేసుకోవాల్సిందే. అనాదిగా వస్తున్న జీళ్ల వ్యాపారం కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీళ్లలో రెండు రకాలు. ఒకటి పిండి జీళ్ళు.. ఇవి నోట్లో వేసుకున్న వెంటనే కరిగిపోతాయి. రెండవది సాగుడు జీళ్ళు ఇది నోట్లో వేశామంటే సాగుతూనే ఉంటాయి. గతంలో ఈ వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలుగా ఉండేది. తిరునాళ్ళలో వీటికి డిమాండ్ చాలా అధికంగా ఉండేది. రానురాను జీళ్ల తినేవారి సంఖ్య తగ్గిపోతుంది. పెరిగిన ధరల నేపథ్యంలో జీళ్ల తయారు చేసేందుకు వ్యాపారులు కూడా వెనుకడుగు వేస్తున్నారు. వారికి గిట్టుబాటు కావడం లేదు.



జీళ్ల తయారు చేస్తున్న దృశ్యం

తగ్గిన అమ్మకాలు

ఉభయ గోదావరి జిల్లాల్లో జీళ్ల తయారీ దారులు వందల సంఖ్యలో ఉండేవారు. అయితే గడిచిన సుబ్రహ్మణ్యషష్టి నుంచి భీమవరం మావుళ్ళమ్మ ఉత్సవాల్లో అలాగే ఇటీవల జరిగిన కొల్లేటి పెద్దింటమ్మ ఉత్సవాలు, శివరాత్రికి బలివే ఉత్సవాల్లో, ఉంగుటూరు, భీమడోలులోని ముగ్గురమ్మల జాతరలో ప్రస్తుతం గణపవరం దండు మారెమ్మ ఉత్సవాలు, అలాగే పిప్పర ముగ్గురమ్మ తిరునాళ్ళలో కూడా గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న జాతరలకు కూడా జీళ్ల వేసేవారు. జీళ్ళ వ్యాపారం చేసేవారు. మధురమైన జీళ్ళను, రుచికరమైన మాటలు కలిపి అమ్ముతుంటారు. రానురాను జీళ్ల తినటం తగ్గటంతో వ్యాపారం సన్నగిల్లుతున్నది. దీంతో వ్యాపారులు కూడా చేసేందుకు ముందుకు రావడం లేదు.

పెరిగిన ఖర్చులు.. తగ్గిన ఆదాయం

జీళ్ల అమ్మటానికి, తయారీకి నలుగురు మనుషులు అవసరం అవుతారు. నలుగురు మనుషుల జీతాలకు రూ.6 వేలు ఖర్చవుతుంది. అదే ఇద్దరైతే రూ.3 వేలు అవుతుంది. ఈ రకంగా ఖర్చులు పోను ఆదాయం లభించడం లేదంటున్నారు. మరోపక్క బెల్లం ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. బెల్లం నంబర్ వన్ రకం కిలో రూ.55 వరకు ఉంటుంది. నేతిజీళ్ళు కిలో రూ.250, సాదావి రూ.200లకు విక్రయిస్తున్నారు.సరైన ఆదాయం లేకపోవడంతో వ్యాపారులు ముందుకు సాగడం లేదు.


వినతిపత్రం ఇస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ధర్నాలో పాల్గొన్న ప్రజలు

టిడ్కో గృహ సముదాయాలు

లబ్ధిదారులకు స్వాధీనం చేయండి

కలెక్టరేట్ వద్ద సీపీఎం మహాధర్నా

భీమవరం అర్బన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్ల సమస్యలను తక్షణం పరిష్కరించ పోతే ఉద్యమం ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మార్చి 8 నుంచి 16 వరకు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం భీమవరంలోని కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపట్టారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణం స్వాధీనం చేయాలని నినదించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 20వేల పైగా టిడ్కో ఇళ్లు ఉన్నాయని, ఎక్కడా కనీస సౌకర్యాలు లేవని మండిపడ్డారు. ప్రజల డబ్బుతో కట్టించి ప్రజలకు స్వాధీనం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేయకపోతే తామే పేదలను తీసుకెళ్లి స్వాధీనం చేసుకోవాల్సి వస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ కాలనీలు ప్రతిపక్ష కాలనీలుగా మారుతున్నాయన్నారు. టిడ్కో ఇళ్లను ఒక ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఇప్పుడున్న కాలనీలను ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అనంతరం డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా హౌసింగ్ డీఈ ఈ.రమణకు వినతిపత్రం అందించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బలరాం, చింతకాయల బాబురావు, కౌరు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, పీవీ.ప్రతాప్, దూసి కళ్యాణి, క్రాంతిబాబు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, కె.రాజారామ్మోహన్‌రాయ్, జుత్తిగ నర్సింహమూర్తి, బాలం విజయకుమార్, బొక్కా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మే 7 నుంచి ట్రిపుల్ ఐటీకి సెలవులు

నూజివీడు టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లకు మే 7 నుంచి వేసవి సెలవులు ఇస్తున్నట్లు డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు మే 7న పరీక్షలు ముగుస్తున్నందున సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసుకుని క్యాంపస్ నుంచి వెళతారని, సెమిస్టర్లలో ఉత్తీర్ణులకు వేసవిలో రెమిడియల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వేసవి సెలవుల్లో ఆన్‌లైన్ సమ్మర్ ప్రాసెస్ నిర్వహించడం జరుగుతుందని, విధివిధానాలను త్వరలో నిర్ణయించనున్నట్లు ఆయన తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బ్రాంచ్ ఓరియంటేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుందని, తర్వాత సెలవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లలో జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

ముగిసిన ఏపీపీఎస్సీ పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్ల ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహిస్తోన్న పరీక్షలు సోమవారం ముగిశాయి. వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఉదయం సెషన్ పరీక్షకు 182మంది అభ్యర్థులను కేటాయించగా 117మంది, మధ్యాహ్నం సెషన్‌కు 182మందికి 116మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదని నిర్వాహకులు తెలిపారు.

ఇంటర్ బ్రిడ్జికోర్సు పరీక్షలకు 498మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో సోమవారం జరిగిన ప్రథమ సంవత్సరం బ్రిడ్జి కోర్సు పరీక్షకు జిల్లాలో 1743మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1245మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్‌విభాగంలో 10 మంది, ఒకేషనల్ విభాగంలో 1245మంది హాజరు కాగా 498మంది గైర్హాజరయ్యారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ


విరిగిన విద్యుత్ స్తంభం

పెనుమంట్ర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనుమంట్రలో రహదారి పక్కన విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ లారీ ఢీకొంది. విద్యుత్ స్తంభం విరిగిపోయినా తీగలు తెగిపడకపోవడం, స్తంభం గాలిలో వేలాడుతూ ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. స్తంభం పడిపోయినా, విద్యుత్ తీగలు తెగిపడినా ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం పెనుమంట్ర గ్రామ పంచాయతీ సమీపంలో ఇసుక లోడు లారీ వెనక్కి వెళుతూ పక్కనే విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో స్తంభం విరిగినా విద్యుత్ తీగల ఆధారంగా ఊగుతూ దర్శనమిచ్చింది. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు.

ట్రాలీ లారీని ఢీకొన్న మరో లారీ : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


దెబ్బతిన్న ట్రాలీ లారీ, గాయపడిన డ్రైవర్

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బ్రిడ్జి మెయిన్ బైపాస్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ముందు వెళ్తున్న ఒక ట్రాలీ లారీని వెనుక నుంచి మరో ట్రాలీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఢీ కొన్న లారీ డ్రైవర్ మిర్యాలగూడనకు చెందిన రాజు(33) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు విజయవాడకు రిఫర్ చేయడంతో 108 అంబులెన్సులో తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేయలేదు.

పశు బీమా అమలు



గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం ప్రజలు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు జీవనాధరంగా జీవిస్తుంటారు. వారి జీవనోపాధికి భరోసాగా ప్రభుత్వం పశు బీమా పథకాన్ని పునరుద్ధరించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీమా పథకం రైతులను ఆదుకుంది. అనంతరం వైసీపీ ప్రభుత్వం తరువాత అరకొరగా బీమా చెల్లించి చేతులు దులుపేసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ నెల 1 నుంచి బీమా పథకం పునరుద్ధరించి ప్రీమియం మొత్తాన్ని కూడా విడుదల చేసింది.

- వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- పునరుద్ధరించిన టీడీపీ ప్రభుత్వం
- ప్రీమియంలో 80 శాతం రాయితీ
- మూడేళ్లకు రూ.192 ప్రీమియం

ఏలూరు టూటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ కొందరికి జీవనాధారం. ప్రమాదవశాత్తు మూగజీవాలు మృత్యువాత పడితే ఆయా కుటుంబాలకు ఆర్థిక నష్టం తప్పదు. పాడిరైతుల కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం పశుబీమా పథకాన్ని తిరిగి ప్రారంభించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీమా పథకం ద్వారా ఎంతో మంది రైతులను ఆదుకుంది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అరకొరగా బీమా చెల్లించి చేతులు దులుపుకుంది. పశువులను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం రాక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కూటమి ప్రభుత్వం పశుబీమా పథకాన్ని పునః ప్రారంభించింది.

ఏలూరు జిల్లాకు రూ.11లక్షలు పశుబీమా ప్రీమియం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 1నుంచి ప్రారంభమైన ఈ పథకంలో 350మంది రైతులు తమ పశువులకు బీమా చేయించారు. బీమా ప్రీమియంలో 80శాతం ప్రభుత్వ సబ్సిడీ కాగా 20 శాతం రైతులు చెల్లించాలి. ఒక కుటుంబానికి 5 పశువుల వరకు బీమా వర్తిస్తుంది.

మేలు జాతి ఆవులు, గేదెలకు రూ.30వేలు నాటుగేదెలు, ఆవులకు రూ.15వేలు బీమా చెల్లిస్తారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పశుపోషకులకు బీమాలో 80శాతం రాయితీ ఇస్తున్నారు. నాటుఆవులు, గేదెలకు రూ.15వేలు బీమా చేస్తే మూడేళ్లకు ప్రభుత్వం రూ.768 ప్రీమియంలో సబ్సిడీగా ఇస్తుంది. పశుపోషకులు కేవలం రూ.192 తమ వాటా ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. మేలుజాతి రకం ఆవులు, గేదెలకు 30శాతం బీమా ప్రభుత్వం అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ పశుపోషకులు మూడేళ్లకు రూ.384 చెల్లిస్తే ప్రభుత్వం రూ.1536 ప్రీమియం భరిస్తుంది. దారిద్రరేఖకు ఎగువన ఉన్న పశు పోషకులకు 50శాతం ప్రీమియం రాయితీ ఇస్తుంది. రూ.15వేల గేదెకు రూ.480 ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రైతులు మరో 480 చెల్లిస్తే మూడేళ్లకు బీమా వర్తిస్తుంది. పశువుకు రూ.30వేల బీమా చేస్తే రూ.960 రైతు, మరో రూ.960 ప్రభుత్వం చెల్లిస్తుంది. మూడేళ్లలో పశువులు మృత్యువాత పడితే బీమా మొత్తం అందుతుంది. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఒక కుటుంబానికి సంవత్సరానికి 50 జీవాల వరకు పశుబీమా వర్తిస్తుంది. 6నెలలు ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలకు రూ.6వేలు బీమా ప్రభుత్వం చెల్లిస్తుంది. ఎస్సీ, ఎస్టీ సామాజికి వర్గానికి చెందిన గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీ ఇస్తుంది. సంవత్సరానికి రూ.36 పెంపకందారు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. దారిద్రరేఖకు ఎగువన ఉన్న లబ్ధిదారులకు 50శాతం బీమా ప్రీమియం ప్రభుత్వం భరిస్తుంది. సంవత్సరానికి రూ.90, మూడేళ్లకు రూ.188 చెల్లిస్తే సరిపోతుంది.

దగ్గరలోని పశువైద్యశాలలో రైతులు పశువులకు బీమా చేయించుకోవచ్చు. ప్రస్తుతం మేలు జాతి పశువుల ధర రూ.లక్ష వరకు ఉంది. ప్రభుత్వం రూ.30వేలు మాత్రమే బీమా వర్తింపచేస్తుంది. అదనంగా రూ.లక్ష వరకు బీమా కావాలంటే అధికంగా ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. పశువు విలువలో 6.4 శాతం ప్రీమియం చెల్లించాలి. బీమా ప్రీమియం చెల్లించిన పశువు చెవికి ట్యాగ్ వేస్తారు. పశువు చనిపోయినప్పుడు చెవిట్యాగ్ ఆధారంగా బీమా చెల్లిస్తారు. బీమా చేయించుకోవడానికి రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకుపాస్‌బుక్, తెల్లరేషన్‌కార్డును తీసుకెళ్లాల్సి ఉంటుంది.

ప్రతి పశువుకు బీమా చేయించండి

పశు పోషకులు ప్రతి పశువుకు బీమా చేయించాలి. పశువులు మృత్యువాత పడితే రైతు ఆర్థిక నష్టం లేకుండా ప్రభుత్వం పశుబీమా పథకం తీసుకొచ్చింది. ఆయా వర్గాల వారీగా 80శాతం, 50శాతం బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది. స్వల్ప ప్రీమియంతో మూడేళ్ల పాటు బీమా ఉంటుంది ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

గోవిందరాజు, జేడీ పశు సంవర్థక శాఖ

ఏలూరు జిల్లాలో పశువుల సంఖ్య

ఆవులు	1,35,607
గేదెలు	5,06,110
గొర్రెలు	5.26,836
మేకలు	1,98,810

క్లస్టర్.. వీఆర్వో క్యాడర్‌కు కష్టం


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వీఆర్వోల సంఘ నాయకులు

భీమవరం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో క్లస్టర్ విధానం వీఆర్వోలకు క్యాడర్‌కు ఇబ్బంది అని సంఘ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండు సచివాలయాలను కలిపి క్లస్టర్‌గా చేసి ఒక వీఆర్వోను నియమించడంతో క్యాడర్ సామర్థ్యం తగ్గుతుందన్నారు. వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు పలు సమస్యలను సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలో సుమారు 7,500 మంది క్యాడర్ సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. మిగిలిన వీఆర్వోలను ఏమి చేస్తారు, ఏ ప్రాతిపదికన ఎవరిని మండలాలు, మున్సిపాలిటీ నుంచి తీసుకుంటారా, వారందరికీ ప్రమోషన్లు కల్పిస్తారా, లేక మాతృశాఖలో విలీనం చేస్తారా స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అర్హులైన వీఆర్వోలకు సీనియార్టీ ప్రకారం ముందుగా ప్రమోషన్ కల్పించిన తర్వాతే రేషనలైజేషన్ ప్రక్రియలో క్లస్టర్‌కు ఒక వీఆర్వో ఉండేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వీఆర్వోలు ఇతర శాఖల పనులు, సర్వేలతో ఇబ్బంది పడుతున్నారని, క్లస్టర్ పేరుతో రెండు సచివాలయాలకు ఒక వీఆర్వోను నియమిస్తే రెవెన్యూ సేవలు పూర్తిగా ఆలస్యమవుతాయన్నారు. సచివాలయానికి ఒక వీఆర్వో విధానాన్ని కొనసాగించాలని కోరారు. క్యాడర్ సామర్థ్యం తగ్గితే భవిష్యత్‌లో ప్రమోషన్ పొందాల్సిన వీఆర్ఏలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు జకరయ్య, భీమవరం, నరసాపురం డివిజన్ అధ్యక్షులు కెనడి, కె.సత్తిబాబు, అత్తిలి మండల అధ్యక్షుడు బాబులు, భూషణం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


సరిపల్లెలో నాగేశ్వరరావు మృతదేహం

గణపవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన చనుమూరి నాగేశ్వరరావు (53)ను కారు ఢీకొనడంతో మృతి చెందారు. సరిపల్లె మాజీ సర్పంచ్ చనుమూరి పోతురాజు కుమారుడు నాగేశ్వరరావు ఆదివారం రాత్రి తన ఇంటి వద్ద నడుచుకుంటూ వెళుతుండగా కారు అతివేగంగా నాగేశ్వరరావును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు పృధ్వీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మణికుమార్ తెలిపారు.

వెళుతున్న ఆటో నుంచి కిందపడి..

జంగారెడ్డిగూడెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వెళుతున్న ఆటో నుంచి ప్రయాణికుడు కిందపడిపోవడంతో మృతి చెందాడు. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మర్రి సీతయ్య (49) పొగాకు పనికి చల్లావారి గూడెం వచ్చాడు. సోమవారం బోసుబొమ్మ సెంటర్ నుంచి ఏపి 39 4126 నెంబరు ఆటోలో చల్లావారిగూడెం బయలుదేరాడు. ఆటో జల్లేరు బ్రిడ్జి దాటగానే డ్రైవర్ ఆటోను నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడంతో సీతయ్య కిందికి జారి పడ్డాడు. తీవ్ర గాయాలవడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడని హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

భార్యాభర్తల కలహం

మహిళ ఆత్మహత్య

పెదవేగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : భార్య, భర్తల మధ్య కలహం చివరకు ఆత్మహత్యకు దారితీసింది. ఇద్దరి మధ్య గొడవతో మనస్తాపం చెందిన భార్య ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పెదవేగి మండలం బి.సింగవరం గ్రామానికి చెందిన పలగాని రాంబాబు, రామ తులసి భార్యాభర్తలు. వారికి 11ఏళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన భార్య రామ తులసి, ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించే సరికే రామతులసి(29) మృతి చెందింది. ఆమె తండ్రి పరసా ఆశీర్వాదం ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

అక్రమ ఆయుధాలు

ఒకరి అరెస్టు

గణపవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నారన్న సమాచారంపై గణపవరం పోలీసులు మెరుపు దాడి చేశారు. ఆయుధాలు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై మణికుమార్ సోమవారం తెలిపారు. గణపవరానికి చెందిన జంబలవాల గోపి ఎటువంటి లైసెన్సులు లేకుండా రెండు నాటు తుపాకులు, మూడు నాటు తుపాకుల బట్‌లు కలిగి ఉన్నాడు. వాటిని స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామని ఎస్సై మణికుమార్ తెలిపారు.

మహిళల మెడలో మంగళ సూత్రాల చోరీ

జంగారెడ్డిగూడెం,మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండ రామాలయం వద్ద దొంగలు ఆరుగురి మహిళల మెడలో మంగళ సూత్రాలు కొట్టేశారు. ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాల్లో మహిళలు పూజలు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు మంగళ సూత్రాలను కట్ చేశారు. కొద్దిసేపటి తర్వాత మహిళలు తమ మెడలో సూత్రాలు పోయాయని గుర్తించారు. రాజమండ్రి రత్నకుమారి మూడు కాసుల బంగారు తాడు, సూత్రాలు, అల్లాడ లక్ష్మికి చెందిన ఒక కాసు సూత్రాలు, సాయిల లక్ష్మికి చెందిన ఒక సూత్రం, తానింకి విజయకుమారి మెడలో ఒక కాసు సూత్రాలు, తలారి రత్నకుమారికి చెందిన సూత్రాలు, మరో మహిళ మెడలో సూత్రాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు జరుగుతుండగా చోరీ జరగడం భక్తులలో కలకలం రేపింది.

9 గ్రాముల బంగారు రింగులు..

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్త బస్టాండ్ వద్ద సీఎంఆర్ జ్యూవెలరీ షోరూమ్‌లో రెండు ఉంగరాలు అపహరించారని త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 16న మధ్యాహ్నం ఒక వ్యక్తి ఉంగరాలు చూపించాలని అడిగాడు. ఖాతాదారుల రద్దీ ఉండడంతో ఆ వ్యక్తి రెండు ఉంగరాలు (9గ్రాముల బరువు) తీసుకుని వెళ్లిపోయాడు. సీఎంఆర్ మేనేజర్ జి బాలకృష్ణ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ వి కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై వచ్చి.. అడ్రస్ అడుగుతూ..

టి.నర్సాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వచ్చిన ఆగంతకులు అడ్రస్ అడుగుతూ మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించారు. ఏపిగుంట పంచాయతీ శ్రీరామవరం గ్రామానికి చెందిన కొలగాని లక్ష్మి, ఆమె భర్త లక్ష్మీనారాయణ మనవళ్లతో కలిసి ఆదివారం మోపెడ్‌పై కామవరపుకోట మండలం వెంకటాపురంలో కనకదుర్గమ్మ తిరునాళ్లకు వెళ్లారు. రాత్రి 10.50 గంటలకు తిరిగి వస్తుండగా మధ్యాహ్నపువారిగూడెం శివారులో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అడ్రస్ అడిగారు. అంతలోనే మోపెడ్‌ను తన్నడంతో కిందపడిపోయారు. లక్ష్మి మెడలో 3కాసుల నాన్‌తాడు లాక్కుపోయారు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

ఏసీబీ కేసులో తప్పుడు సాక్ష్యం

» **ఇద్దరికి జైలు శిక్ష**

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధకశాఖ కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పిన ఫిర్యాదుదారు, అతడితో పాటు సాక్షిగా ఉన్న మరొకరికి ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానం మూడు నెలలు జైలు శిక్ష శిక్ష విధించింది.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన కంచెర్ల నాగలింగం వద్ద నుంచి 2006 అక్టోబర్ 23న ఏలూరు రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మారిశెట్టి పోతరాజు ఐదు వేల రూపాయలు లంచం తీసుకున్నారు. ఆ సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని మారిశెట్టి పోతురాజుపై కేసు నమోదు చేశారు. ఈకేసు విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ కొనసాగుతుంది. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన కంచెర్ల నాగలింగం, మరో సాక్షి అయిన గోగులగొండ బాబీ కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పారు. దీంతో విజయవాడలోని మూడో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో వారు తప్పుడు సాక్ష్యం చెప్పినందుకు మూడు నెలల పాటు సాధారణ జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానాతో పాటు కోర్టు సమయం ముగిసే వరకూ నిలబడి ఉండాలని ఈనెల 11న కోర్టు తీర్పు ఇచ్చిందని విజయవాడ ఏసీబీ ప్రధాన కార్యాలయాల ప్రజాపౌర సంబంధాల అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీబీ కేసులలో ఎవరైనా తప్పుడు సాక్ష్యం చెబితే ఇదే విధంగా శిక్షలు పడతాయని తెలిపారు.

పల్సర్ బైక్‌లో మంటలు



ఆకివీడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాహనదారు గుర్తించకున్నా స్థానికులు హెచ్చరించడంతో ప్రమాదం తప్పింది. స్థానిక పెద్దింట్లమ్మ వీధిలో యువకుడు సోమవారం పల్సర్ బైక్‌పై వెళతుండగా వెనుక నుంచి మంటలతో కూడిన పొగ వచ్చింది. అదే ప్రాంతంలో ఆటో డ్రైవర్ గమనించి వాహనదారుని హెచ్చరించాడు. బండి ఆపి నీళ్ల పోయడంతో మంటలు ఆరాయి. షార్ట్ సర్క్యూట్ తో మంటలు వచ్చినట్లు గుర్తించారు.

ఎస్సీ కార్పొరేషన్

ఈడీగా ముక్కంటి

ఏలూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోలవరం కుడి కాల్వ పరిధిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.ముక్కంటిని ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నియమితులయ్యారు. ఏలూరు, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లా ఈడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వ సెక్రటరీ ఎంఎం నాయక్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏడాది కాలానికి ముక్కంటి డిప్యూటేషన్‌పై విధుల్లో నియమితులయ్యారు.

గత ఐదేళ్లు అరాచక పాలన

మాజీ ఎంపీ హరిరామజోగయ్య

పాలకొల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జగన్ అరాచక పాలనతో రాష్ట్రానికి రాజధాని కూడా లేకపోవడం దురదృష్టకరమని మాజీఎంపీ చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి వద్ద రాజధాని నిర్మాణానికి శ్రద్ధ తీసుకోవడం, నిర్మాణానికి అవసరమైన నిధులు సేకరించడానికి ప్రయత్నాలు చేయడం రాజధాని పునర్నిర్మాణ పనులు ఏప్రిల్‌లో ప్రధాన మంత్రి మోదీతో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి వల్ల అటకెక్కిన రాజధాని నగరాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమేయంతో రాబోయే మూడేళ్లలో మనం చూడగలుగుతామని, ఈఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన తెలిపారు.

లారీని ఢీకొన్న బైక్ : ఒకరి మృతి

కృత్తివెన్ను, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలంలోని లక్ష్మీపురం లాకు సెంటర్ వద్ద సోమవారం లారీని బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా నాగిడిపాలెం గ్రామానికి చెందిన వల్లభుని రాధాకృష్ణ(57), బర్రె నర్సింహస్వామి (37) ద్విచక్రవాహనంపై వెళుతుండగా జరిగిన ప్రమాదరంలో రాధాకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నర్సింహస్వామిని 108లో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాధాకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రాధాకృష్ణ భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పైడిబాబు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గొలుసుతో బంధించబడిన బాలుడు (ఫైల్)

బాలుడిని గొలుసులతో బంధించిన వారిపై కేసు

నిడమర్రు మార్చి 17 (ఆంధ్రజ్యోతి): క్రొవ్విడి చేలల్లో చేపలు పట్టాడనే నెపంతో పదో తరగతి విద్యార్థిని గొలుసులతో బంధించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 'బాలుడిని కొట్టి.. కుక్క గొలుసుతో బంధించారు' శీర్షికన ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై పోలీసులు స్పందించారు. ఈ కథనం ఆధారంగా విచారణ జరిపారు. క్రొవ్విడి గ్రామానికి చెందిన తాటిపర్తి బుజ్జన్న కుమారుడు లోకేశ్ వరణ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. బుజ్జన్న మేకలు మేపుకొంటున్న సమయంలో తన కుమారుడు వస్తానని చెప్పి ఎంతసేపటికీ రాలేదు. గండికోట వెంకన్న, గండికోట పాండు లోకేశ్‌ను బంధించి కోళ్లగాబుకు ఇనుప గొలుసుతో కట్టేశారు. గ్రామస్తుల చొరవతో విడిపించుకొని వెళ్లగా మళ్లీ కొల్లేరువస్తే చంపుతామని బెదిరించినట్లు బుజ్జన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

42 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

పోలవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 42 మందికి సోమవారం ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 12న చేగొండపల్లి పునరావాస కాలనీలోని వైద్య శిబిరంలో గుర్తించిన వారికి రాజమహేంద్రవరంలోని గౌతమీ నేత్రాలయ వైద్యుల పర్యవేక్షణలో ఆపరేషన్లు నిర్వహించినట్టు తెలిపారు.

ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహించాలి

ఉంగుటూరు,మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ఎప్పటి కప్పుడు బూత్ లెవెల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్వహించాలని ఏలూరు రెవెన్యూ డివిజినల్ అధికారి అచ్యుత అంబరీష్ అన్నారు. సోమవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల నియమ నిబంధనలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భవిష్యత్తులో నిర్వహించే ఎన్నికలకు పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణచంద్ర వర ప్రసాద్ నుంచి వివరాలడిగారు.

ప్రజా సంక్షేమం కోసం విశేష కృషి

ఏలూరుటూటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 4, 5 డివిజన్లలో రూ.29 లక్షలతో నూతనంగా నిర్మించే రోడ్లకు ఎమ్మెల్యే చంటి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో నెరవేరుస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి అంజనేయులు, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్చొద్దు

చింతలపూడి, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు పేరున ఉన్న తెలుగు విశ్వ విద్యాలయం పేరును మార్చడం సరికాదని తహసీల్దార్‌కు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు వజ్రపు శేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఈ విధంగా చేయడం సబబుకాదన్నారు. విజ్ఞాపన పత్రం అందించిన వారిలో చిట్లూరి అంజిబాబు, కంభంపాటి వాసు, తదితరులు ఉన్నారు.

కనీస వేతనం చెల్లించాలి : సీఐటీయూ

ఏలూరు రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి) : స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం 15 వేల రూపాయలివ్వాలని స్కూలు శానిటేషన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.దుర్గ, కార్యదర్శి కె.విజయలక్ష్మి, నాయకులు ఎన్.విజయలక్ష్మి, పి.రమణమ్మ మాట్లాడుతూ తమ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. వీరి ఆందోళనకు గౌస్య సబేర, కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా నాయకులు బి.సోమయ్య, ఎం.దుర్గా రావు సంఘీభావం తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేయండి

ఏలూరు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు, ఇతర ఉద్యమాల్లో పాల్గొన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి హోంశాఖ మంత్రి వి.అనితకు వినతిపత్రాన్ని అందజేశారు. ఏలూరు, విజయవాడ పోలీస్ స్టేషన్లలో మొత్తం 65మంది ఉద్యోగ, ఉపాధ్యాయులపై కేసులు నమోదయ్యాయని, వీరంతా ఇప్పటికీ కేసుల వాయిదాల నిమిత్తం కోర్టుల చుట్టూ తిరుగుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి ఎమ్మెల్సీ తీసుకెళ్లారు. కేసులను రద్దుచేయాలని మంత్రిని అభ్యర్థించారు.

కౌలు రైతులకు హామీ లేని రుణాలివ్వాలి

ఏలూరు రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు హామీలేని రుణాలివ్వాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా కార్యదర్శి దొంతు కృష్ణ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ చట్టసభల్లో రైతుల సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.కన్నయ్య, కె.నాగేశ్వరరావు, టి.ప్రసాద్, డి.రామచంద్రరావు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయండి : ఏఐవైఎఫ్

ఏలూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు భృతి అందించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ తొర్లపాటి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి అమలు చేయడంలేదన్నారు. ఈ ధర్నాలో మాజీ నాయకులు హేమశంకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్, ఎం.క్రాంతి, కె.ప్రసన్నకుమార్, డి.కిషోర్, కె.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

చేనేత రంగానికి రెండు వేల కోట్లు కేటాయించాలి

ఏలూరురూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రెండు వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించింది. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడుపు కన్నయ్య మాట్లాడుతూ చేనేత వస్త్రాలపై, జరీ, పట్టు, రసాయనంపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణ చైతన్య, ఆర్.లక్ష్మణరావు, నాయకులు బి.రామకృష్ణ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రైతులకు ఇక్కట్లు : చింతమనేని

ఏలూరురూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో సాగునీటి సరఫరాను పరిశీలించారు. వైసీపీ హయాంలో సాగునీటి వ్యవస్థ నిర్వీర్యమవడంతో ఇప్పటికీ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు అధైర్యపడొద్దని అందరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్.నాగరాజు, ఎన్.రవి, ఎల్.సత్యనారాయణ, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ప్రజా చైతన్య యాత్రలు

బుట్టాయగూడెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం బుట్టాయగూడెం బస్టాండ్ సెంటరు వద్ద సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి జెండా ఊపి ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. హామీల అమలు కోరుతూ బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో ప్రజా చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, కె.భీమరాజు, పి.శేఖర్, ఎస్.సాయికృష్ణ, అనూష, గంగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్యంలో టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

పోలవరం, మార్చి17(ఆంధ్రజ్యోతి) : పంచాయతీలు, మున్సిపాలిటీల్లో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని పోలవరం పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు ఫణీంద్ర డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులతో ఏలూరు కలెక్టరేట్ వద్ద జరగనున్న టెండరు విధాన రద్దు నిరసన కార్యక్రమానికి తరలి వెళ్తున్న సందర్భంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పారి శుధ్యం మెరుగుదలకు అహర్నిశలూ పని చేస్తున్న ఉద్యోగుల ఉపాధిని ఉద్యోగ భద్రతను భగ్నం చేసే టెండరు విధానాన్ని రద్దు చేసేవరకూ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారా నాని, వారా నరేష్, వారా శేషాద్రి, బంగారు వెంకటేశ్వరరావు, సామేలు, మాడుగుల పెద్దింట్లు పాల్గొన్నారు.

గింజలు కొనుగోలు చేసి కోకో రైతులను ఆదుకోవాలి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కోకో రైతుల వద్ద ఉన్న గింజలను వెంటనే కొనుగోలు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘ నాయకులు కె.శ్రీనివాస్ బృందం కోరింది.సోమవారం రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాస్‌ను కలుసుకుని ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.కోకో రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు పి.సీతారామయ్య, పి.నరేష్, జాస్తి బాబు, పి.లోకేష్ ఉన్నారు.

ప్రయాణికుల రక్షణ బాధ్యత డ్రైవర్లదే : రమేష్ బాబు

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లదే కీలక పాత్ర అని రవాణాశాఖ మోటారు వాహన తనిఖీ అధికారి పి.రమేష్‌బాబు పేర్కొన్నారు. ఏలూరు జిల్లా ఉపరవాణా కమిషనర్ ఆదేశాల మేరకు ఏలూరునగరంలోని ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు వాహన తనిఖీ అధికారులు పి.రమేష్‌బాబు మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో ప్రమాదాలను ముందే పసిగట్టి చాకచక్యంగా తప్పించగలిగే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రజలను, విద్యార్థులను వారి వారి గమ్యస్థానాలకు ప్రతి డ్రైవర్ బాధ్యతగా చేర్చాలన్నారు. ప్రతి వాహనదారుడు ఎప్పటికప్పుడు వాహనాలకు ఫిట్‌నెస్, పొల్యూషన్ పరీక్షలు, వాహన భీమా చేయించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కల్గి ఉన్న వారు మాత్రమే వాహనాలను నడపాలన్నారు.

సమస్యలు తిష్ఠ..

● మురుగుతో దుర్వాసన, దోమలతో ఇక్కట్లు
● ఏలూరు డివిజన్లలో ఏళ్ల తరబడి ప్రజా జీవనానికి ఆటంకం


ఖాళీ స్థలాల్లో పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు

ఏలూరు టూటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని 50 డివిజన్లలో ఎన్నో సమస్యలు తిష్టవేశాయి. సంవత్సరాలు తరబడి సమస్యలకు పరిష్కారం లభించడంలేదు. ప్రతీ డివిజన్స్‌లో సమస్యలను అధికారులు పరిష్కరించే దిశగా 'ఆంధ్రజ్యోతి' డివిజన్ వాచ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 29వ డివిజన్‌లో అనేక సమస్యలను గుర్తించింది. ముఖ్యంగా ఇక్కడ ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా మారాయి. ఇళ్ల కంటే ఖాళీస్థలాలే ఎక్కువగా ఉన్నాయి. వీటిలో ముళ్లచెట్లు ఏపుగా పెరిగాయి. కాలంతో నిమిత్తం లేకుండా ఎప్పుడు ఇక్కడ నీరు నిల్వ ఉంటుంది. వాటిలో పందులు తిష్ట వేస్తున్నాయి. అక్కడే పిల్లలను కంటున్నాయి. దీంతో దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీనికి తోడు డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉంది. మురుగు సరిగా పారకపోవడంతో దుర్వాసనలోనే ప్రజలు జీవిస్తున్నారు. దీంతో ఇక్కడ కూడా దోమలు విపరీతంగా ప్రబలుతున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని గుంతలు పూడ్చినప్పటికి నూతన రోడ్ల నిర్మాణం జరగలేదు. మున్సిపల్ అధికారులు సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


డ్రెయినేజీతో పాటు అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలం

సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం

డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాం. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు పంపుతాం. అప్పటికీ పట్టించుకోకపోతే యాజమానులపై జరిమానాలు విధించి శుభ్రం చేయిస్తాం. దోమల నిర్మూలనకు ఎప్పటికప్పుడు స్ప్రేలు చేయిస్తున్నాం. కుక్కల నిర్మూలనకు వాటిని పట్టుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయిస్తున్నాం. పందుల యాజమానులకు ఊరుబయటకు తరలించాల్సిందిగా ఆదేశాలిచ్చాం.

సంజయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

డివిజన్లలోని సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ఇప్పటికే చాలా సమస్యలు పరిష్కరించాం. ఎప్పటికప్పుడు డ్రైన్లను శుభ్రం చేయిస్తున్నాం. ఖాళీ స్థలాల యాజమానుల పై చర్యలు తీసుకోవాలని అధికారులకు చెబుతున్నాం.

తంగిరాల అరుణ సురేష్, కార్పొరేటర్



బుట్టాయగూడెంలో బస్సు ఎక్కుతున్న విద్యార్థినులు, పెదపాడులో హాల్ టికెట్ల పరిశీలన దృశ్యం



పెదవేగి, పోలవరంలోని పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు, అధికారులు

మొదటి రోజు ప్రశాంతం

● టెన్త్ పరీక్షలతో విద్యా కేంద్రాల్లో సందడి
● పోలీసులతో భద్రత కట్టుదిట్టం

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

టెన్త్ క్లాస్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు చేయగా విద్యార్థులు హాల్ టికెట్లతో వచ్చి తమ నెంబర్లు చూసుకుని ఆయా పరీక్షా కేంద్రాలకు తరలివెళ్లారు. రెగ్యులర్ విద్యార్థులు దాదాపుగా అంతా పరీక్షలు రాసేందుకు హాజరవగా ప్రైవేటుగా ఫీజులు కట్టిన అభ్యర్థులు మాత్రం చాలా వరకు పరీక్షలు రాసేందుకు హాజరుకాలేదు.. ఇదిలా ఉంటే మండలాల వారీగా ఆయా కేంద్రాల్లో హాజరైన విద్యార్థులు గైర్హాజరైన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలంలో మొత్తం 20 ఉన్నత పాఠశాలలకు గానూ 837 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 819మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో -2 వి.అరుణ్‌కుమార్ తెలిపారు. 18మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్టు తెలిపారు. కామవరపుకోట మండలంలో 275 మందికి గాను 271 మంది హాజరుకాగా 14 మంది గైర్హాజరైనట్టు పరీక్షా కేంద్రం నిర్వాహకులు తెలిపారు. తడికలపూడి ఎస్ఐ చిన్నారావు భద్రతను పర్యవేక్షించారు. బుట్టాయగూడెం మండలంలో 705 మందికి 651 మంది పరీక్షలు రాశారని, 54 మంది హాజరు కాలేదని మండల విద్యాశాఖాధికారి టి.బాబురావు తెలిపారు. లింగపాలెం మండల వ్యాప్తంగా నాలుగు పరీక్షా కేంద్రాల్లో 633 మంది విద్యార్థులకుగానూ 618మంది హాజరవగా 12మంది గైర్హాజరయ్యారని ఎంఈవో రామారావు తెలిపారు. భీమడోలు మండలంలో 996 విద్యార్థులకు గాను 969 విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 27 మంది గౌర్హాజరయ్యారు. పెదపాడు మండలంలో 811 మంది విద్యార్థులకు గానూ 779 మంది పరీక్షకు హాజరు కాగా 32 మంది గైర్హజరయ్యారు.టి.నర్సాపురం మండల వ్యాప్తంగా 480 మంది విద్యార్థులకు గానూ 463మంది హాజరవగా 17మంది గైర్హాజరయ్యారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండల వ్యాప్తంగా జరిగిన ప్రరీక్షలను తహసీల్దారు కె.స్లీవజోజి పరిశీలించారు. మండల వ్యాప్తంగా 417 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 385 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో-2 ఎస్.బుచ్చయ్య తెలిపారు. ఉంగుటూరు మండలంలో 799 మంది పరీక్షలకు హాజరుకాగా అందులో 11 మంది ప్రైవేటు విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారిణి రవీంద్ర భారతి తెలిపారు. కుక్కునూరు మండలంలో టెన్త్ పరీక్షలకు 308మంది హాజరు కావాల్సి ఉండగా 294 మంది హాజరయ్యారు.14 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖాధికారులు తెలిపారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి : కలెక్టర్

ఏలూరుసిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : జీరో పావర్టీ పి-4 గోడపత్రికను సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పి-4 విధానం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పి-4 విధానంలో ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజాన్ని సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈనెల 25వ తేదీ లోపు స్వర్ణాంధ్ర వెబ్‌సైట్‌లో ప్రజలు అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు.

మిషన్ వాత్సల్యపై సమీక్ష..

ఏలూరు : మిషన్ వాత్సల్య పథకాన్ని అధికారులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా బాలల సంక్షేమం, రక్షణ కమిటీ సమావేశంలో మిషన్ వాత్సల్య కార్యక్రమంపై పోక్సో కోర్టు జడ్జి ఎస్ ఉమా సునంద్‌తో కలిసి ఆమె సోమవారం సమీక్షించారు. ఈ పథకం ద్వారా సమాజంలో నిరాదరణకు గురైన బాలలకు రక్షణ కల్పించి వారి విద్యా, ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలన్నారు. బాల్య వివాహాల నుంచి బాధితులను రక్షించి వారికి పునరావాస కార్యక్రమాలను అందిస్తామన్నారు. జడ్జి ఉమాసునంద మాట్లాడుతూ పోక్సో కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని కోర్టుకు సమర్పించేందుకు బాధితులకు అధికారులు సహాయ, సహకారాలు అందించాలన్నారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, జడ్పీ సీఈవో భీమేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శారదలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార సంవత్సరంపై...

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని, ఈ నేపథ్యంలో సహకార శాఖ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ సహకార సంవత్సరం థీమ్ లోగోను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాలతో గ్రామాల్లో ప్రజలకు స్థిరమైన జీవనోపాధి సృష్టించాలని, వారి ఆర్థికాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాలన్నారు. ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు ర్యాలీలు, సమావేశాలు, మారథాన్‌లు నిర్వహించాలన్నారు. ఏప్రిల్‌లో రక్తదాన, వైద్య శిబిరాలు, మేలో అవగాహన కార్యక్రమాలు, జూన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం, జూలై 5న అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ర్యాలీలు, మారథాన్‌లు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీసీసీబీ సీఈవో పి.సింహాచలం, డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ హబీబ్ భాషాలు పాల్గొన్నారు.

పశువులకు ఎండు గడ్డి కరువు


ట్రాక్టర్‌పై పశుగ్రాసం తరలిస్తున్న రైతులు

లింగపాలెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో పశువుల ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. పంటపొలాలు బీడువారడంతో వాటికి మేతదొరకక, నీరులేక పశు పోషకులు తమ పశువులను అమ్ముకుంటున్నారు. ఇటీవల ఎక్కువగా వరికోత యంత్రాలతో వరి పంటలను నూర్పిడి చేయడంతో వరిగడ్డి పనికిరాకుండా పోతోంది. ఇతర గ్రామాల నుంచి కొనుగోలు చేయాలంటే ట్రక్కు 12వేల నుంచి 15వేల వరకు ఉంటోంది. దీంతో మేత దొరక్క పాలదిగుబడి లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాడిరైతులను దృష్టిలో పెట్టుకుని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాడిరైతులు వేడుకుంటున్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై సమీక్ష

ఏలూరుసిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి) :తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధకు జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. ఏలూరు జడ్పీ చైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ డీపీవోతో మాట్లాడుతూ తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుకునేలా పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేయాలన్నారు. డీపీవో కె.అనూరాధ స్పందిస్తూ ఇప్పటికే గ్రామ కార్యదర్శులకు ఆదేశాలిచ్చామని, ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తున్నామన్నారు. అలాగే శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీవోకు సూచించారు.

'మిగులు భూములు పంచండి'

టి.నర్సాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): యర్రకాల్వ మిగులు భూములు సాగు చేస్తున్న గిరిజన పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్ర రెండవ రోజైన సోమవారం మండలంలోని మల్లప్పగూడెంలో పార్టీ మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ యాత్ర మండలంలోని అబ్బుల్లాపురం, సాలిగూడెం, మధ్యాహ్నపువారిగూడెం, వెంకటాపురం గ్రామాల మీదుగా బొర్రంపాలెం చేరుకోవడంతో యాత్ర ముగిసింది. ప్రతీ గ్రామంలో యాత్ర బృందానికి అడుగడుగున ప్రజలు స్వాగతం పలికారు. తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు, అలుమోలు మురళీ, మండకం కుమారి, బరగడ కుమారి, చెల్లమ్మ, చినలక్ష్ముడు, తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన బొరగం శ్రీనివాసులు

ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

పోలవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : వింజరం పంచాయతీ బోడిగూడెంలో సోమవారం జరిగిన నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలకు పట్టుగొమ్మలైన గంగానమ్మ, పోతురాజుల నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అర్చకులు వేదపండితుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీవైఈవో కలుం నీలయ్య,వింజరం సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, మూలెం వెంకన్న, అర్చకులు ర్యాలీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు నివేదిక అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్

నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌కు వినతి

ఏలూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) :చింతలపూడి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కలెక్టర్ వెట్రిసెల్విని కలెక్టరేట్‌లో సోమవారం కలిసి చర్చించారు. నాలుగు మండలాల్లో రోడ్లు, ఇతర పనులపై నివేదికను కలెక్టర్‌కు ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి ఉన్నారు.

ఘనంగా సీఆర్‌ఆర్ కళాశాల వార్షికోత్సవం

ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ కిశోర్

ఏలూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌ఆర్ కళాశాల 80వ వార్షికోత్సవం సోమవారం కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్ మాట్లాడుతూ స్వీయ క్రమశిక్షణతో జీవితాన్ని చక్కదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యసనాలకు బానిసలుకాకుండా చదువు అనే ఆయుధం ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సీఆర్‌ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్ మాట్లాడుతూ దాతల విరాళాలతో స్థాపించిన ఈ కళాశాల నేటి ఆధునిక సమాజ అవసరాలకు తగిన సౌకర్యాలతో నిరంతరం మార్పులు చెందుతూ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. విద్యాదాత అల్లూరి బాపినీడు ఎకడమిక్ ఎక్స్‌లెన్స్ పురస్కారాలను కెమిస్ట్రీ లెక్చరర్ కె.జోహార్, జువాలజీ లెక్చరర్ జి.సురేష్ బాబుకు, ప్రతిభా పురస్కారాలను విద్యార్థులకు ఎస్పీ అందజేసారు. వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణు మోహన్, ప్రిన్సిపాల్ రామరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ఎస్పీ

ఆధ్యాత్మిక భావనతో ముక్తి : స్వామి ప్రణవానంద

ఉంగుటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరి లో ఆధ్యాత్మిక భావన కలిగి ముక్తి మార్గంలో పయనిస్తున్నారని స్వామి ప్రణవానంద అన్నారు. సోమవారం ఉం గుటూరు మండలం కైకరం తూర్పు వీధిలో ఉన్న శ్రీ సుం దర సీతారామ మందిరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని దాతల సహకారంతో నిర్మించిన సోలార్ సిస్టంను ప్రారంభించారు. అనంతరం దాతల సహకారంతో నిర్మించిన అర్చక స్వామి వసతి గృహాన్ని ప్రారంభించి శిలా ఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కూనా అప్పారావు, కళింగ రామాలయ కమిటీ సభ్యులు, గీతామృత వాహిని సత్సంగ్, సీతారామ గీతార్చన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు ప్రణాళిక

ఎం.సరళ కుమారి, ఎంపీడీవో, కామవరపుకోట



● **పారిశుధ్యం నిర్వహణకు చేపట్టిన చర్యలేమిటి?**

జవాబు : ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అమలుకు ప్రణాళిక రూపొందించాం.

● **పథకం అమలుకు ఏ విధమైన చర్యలు తీసుకున్నారు?**

జవాబు : ప్రతీ గ్రామంలోనూ ప్రజలను సమావేశ పరిచి రహదారులపై చెత్త వేయకూడదని, రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించాం.

● **మంచినీటి సౌకర్యాలకు ఏవిధమైన చర్యలు తీసుకున్నారు?**

జవాబు : ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన మంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

● **అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై తీసుకున్న నిర్ణయాలు?**

జవాబు : నిబంధనల ప్రకారం అమలు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం.

(కామవరపుకోట-ఆంధ్రజ్యోతి)

గిరిజన చట్టాన్ని అమలు చేయాలి

బుట్టాయగూడెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ చంద్రన్న వర్గం నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.గిరిజనులే సాగులో ఉన్నా వారికి న్యాయం జరగడం లేదన్నారు. గిరిజనులకు చెందాల్సిన భూములను గిరిజనేతరులు అనుభవిస్తున్నారని, ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామన్నారు. ధర్నాలో నాయకులు ఎస్.బాలసుందరం, బి.ఏసుపాదం, పి.పార్వతి, పి.భూలక్ష్మి, జి.సంతోషం, నాగరాజు, గంగ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

19న ఐటీడీఏ వద్ద సాగు భూముల పట్టాల కోసం ధర్నా

పోలవరం, మార్చి17(ఆంధ్రజ్యోతి) : ముప్పై ఏళ్లుగా గిరిజనుల సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించేలా పట్టాలు ఇవ్వాలని ఏజెన్సీ గిరిజన సంఘం, ఏపీ రైతు కూలీ సంఘం డిమాండ్ చేశాయి. సోమవారం ప్రజా సంఘాల నాయకులు భాషా మాట్లాడుతూ జిల్లేళ్లగూడెం, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట పంచాయతీల్లో 1995 నుంచి కోయదొర, కొండరెడ్ల తెగలకు చెందిన గిరిజనులు సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఆ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 19న ఐటీడీఏ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు కూలీ సంఘం నాయకులు ఎస్ ఝాన్సీ, జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

వేలేరుపాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : భూదేవిపేట గ్రామంలో కొలువైన శ్రీచాముండేశ్వరి దేవి ఆలయ దశమ వార్షికోత్సవాలను ఆలయ ధర్మకర్త భూమా శ్రీధర్, దుర్గ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపుకుంకుమ, చీర, సారే నున్నా సుబ్బలక్ష్మి సమర్పించగా ప్రధాన అర్చకులు నందీశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిపించారు.

అధికారిని సస్పెండ్ చేయాలి

బుట్టాయగూడెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుళ్లపూడికి చెందిన మడకం యాకోబును తీవ్రంగా కొట్టి గాయపరచిన అటవీశాఖ అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యాకోబును ఆయన పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. అధికారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.మోహనరావు, సోడెం సుధాకర్ తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ల బహూకరణ

ఉంగుటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కైకరం హైస్కూల్లో పూర్వ విద్యార్థి సనపల రామకృష్ణారావు కిట్స్ సంస్థ తరపున రూ.35 లక్షల విలువైన 35 కంప్యూటర్లు 5 ల్యాప్‌ట్యాప్‌లు అందజేశారు. బాలికా విద్యను ప్రోత్సహించడం తనకు సంతోషంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుళ్ళ ప్రసాదరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి పాల్గొన్నారు.

ముగిసిన మూల్లంక పెద్దింట్లమ్మ ఉత్సవాలు

కలిదిండి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మూల్లంకలో 13 రోజులుగా జరుగు తున్న పెద్దింట్లమ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి పసుపు, కుంకుమలతో అమ్మవారికి పూజలు చేశారు. సుమారు 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఎంపీపీ బండి లక్ష్మీ తులసీరావు, సర్పంచ్ మహదేవ్ విజయ్, ఆలయ చైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, బోళ్ల ఏడుకొండలు, తంగెళ్ల గణపతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాట్రాయి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గీత



చాట్రాయి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చాట్రాయి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ డి.ప్రశాంతి అవినీతి ఆరోపణలతో ఇటీవల సస్పెండ్ అయ్యారు. ఇక్కడ తహసీల్దార్‌ను నియమించే వరకు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గీత ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు నిర్వహిస్తారు.



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి, డాక్టర్ మనోజ్

అమరావతి కోసం.. లక్ష్మీగణపతి హోమం

ముదినేపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం త్వరితగతిన జరగాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చేస్తున్న నిర్విరామ కృషి ఫలించాలని ఆకాంక్షిస్తూ సోమవారం ముదినేపల్లిలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి లక్ష్మీ తమ నివాసంలో తండ్రి డాక్టర్ మనోజ్‌తో కలసి గణపతి హోమం నిర్వహించారు. యాజ్ఞీకుడు గురజకు చెందిన సుసర్ల సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో పలువురు వేద పండితులతో అమరా వతి నిర్మాణం నిర్విఘ్నంగా సాగాలని పూజలు చేశారు. ముదినేపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాడుగుడుల పూర్ణచంద్రరావు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారా యణ, వాసవీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి వత్తుమిల్లి ప్రసాద్, న్యాయవాది రెడ్డి బంగారయ్య, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

జగనన్న కాలనీల్లో అవినీతిని వెలికితీయాలి

కైకలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కైకలూరు జగనన్న కాలనీల్లో జరిగిన అక్రమాలు, కైకలూరు సివిల్ సప్లయిస్ గొడౌన్‌లో బియ్యం అక్రమంగా తరలిపోయిన అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ బొడ్డు నోబుల్ డిమాండ్ చేశారు. సోమవారం కైకలూరులో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అవినీతిని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో వెలుగులోకి తీయాలని, బియ్యం గొడౌన్‌లో కోట్ల రూపాయల విలువైన బియ్యం అక్రమంగా తరలిపోయిందన్నారు. కొల్లేరులో మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో పేదలకు ఇచ్చిన సొసైటీ భూములను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపార్టీ ఓబీసీ అధ్యక్షుడు శాంతి నాగరాజు, ఆచవరం సర్పంచ్ కట్టా నాగరాజు గౌడ్, ఆ పార్టీ నేతలు బుర్ల కృష్ణ, ఈదా పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏపీపీఎస్సీ పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్ల ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహిస్తోన్న పరీక్షలు సోమవారం ముగిశాయి. వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఉదయం సెషన్ పరీక్షకు 182మంది అభ్యర్థులను కేటాయించగా 117మంది, మధ్యాహ్నం సెషన్‌కు 182మందికి 116మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదని నిర్వాహకులు తెలిపారు.

ఇంటర్ బ్రిడ్జికోర్సు పరీక్షలకు 498మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో సోమవారం జరిగిన ప్రథమ సంవత్సరం బ్రిడ్జి కోర్సు పరీక్షకు జిల్లాలో 1743మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1245మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్‌విభాగంలో 10 మంది, ఒకేషనల్ విభాగంలో 1245మంది హాజరు కాగా 498మంది గైర్హాజరయ్యారు.

పశు బీమా అమలు

గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం ప్రజలు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు జీవనాధరంగా జీవిస్తుంటారు. వారి జీవనోపాధికి భరోసాగా ప్రభుత్వం పశు బీమా పథకాన్ని పునరుద్ధరించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీమా పథకం రైతులను ఆదుకుంది. అనంతరం వైసీపీ ప్రభుత్వం తరువాత అరకొరగా బీమా చెల్లించి చేతులు దులుపేసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ నెల 1 నుంచి బీమా పథకం పునరుద్ధరించి ప్రీమియం మొత్తాన్ని కూడా విడుదల చేసింది.

- వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- పునరుద్ధరించిన టీడీపీ ప్రభుత్వం
- ప్రీమియంలో 80 శాతం రాయితీ
- మూడేళ్లకు రూ.192 ప్రీమియం

ఏలూరు టూటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ కొందరికి జీవనాధారం. ప్రమాదవశాత్తు మూగజీవాలు మృత్యువాత పడితే ఆయా కుటుంబాలకు ఆర్థిక నష్టం తప్పదు. పాడిరైతుల కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం పశుబీమా పథకాన్ని తిరిగి ప్రారంభించింది. గతంలో టీడీపీ అధికారం లో ఉన్నప్పుడు బీమా పథకం ద్వారా ఎంతో మంది రైతులను ఆదుకుంది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అరకొరగా బీమా చెల్లించి చేతులు దులుపుకుంది. పశువులను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం రాక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కూటమి ప్రభుత్వం పశుబీమా పథకాన్ని పునః ప్రారంభించింది.

ఏలూరు జిల్లాకు రూ.11లక్షలు పశుబీమా ప్రీమియం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 1నుంచి ప్రారంభమైన ఈ పథకంలో 350మంది రైతులు తమ పశువులకు బీమా చేయించారు. బీమా ప్రీమియంలో 80శాతం ప్రభుత్వ సబ్సిడీ కాగా 20 శాతం రైతులు చెల్లించాలి. ఒక కుటుం బానికి 5 పశువుల వరకు బీమా వర్తిస్తుంది.

మేలు జాతి ఆవులు, గేదెలకు రూ.30వేలు నాటుగేదెలు, ఆవులకు రూ.15వేలు బీమా చెల్లిస్తారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పశుపోషకులకు బీమాలో 80శాతం రాయితీ ఇస్తున్నారు. నాటుఆవులు, గేదెలకు రూ.15వేలు బీమా చేస్తే మూడేళ్లకు ప్రభుత్వం రూ.768 ప్రీమియంలో సబ్సిడీగా ఇస్తుంది. పశుపోషకులు కేవలం రూ.192 తమ వాటా ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. మేలుజాతి రకం ఆవులు, గేదెలకు 30శాతం బీమా ప్రభుత్వం అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ పశుపోషకులు మూడేళ్లకు రూ.384 చెల్లిస్తే ప్రభుత్వం రూ.1536 ప్రీమియం భరిస్తుంది. దారిద్రరేఖకు ఎగువన ఉన్న పశు పోషకులకు 50శాతం ప్రీమియం రాయితీ ఇస్తుంది. రూ.15వేల గేదెకు రూ.480 ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రైతులు మరో 480 చెల్లిస్తే మూడేళ్లకు బీమా వర్తిస్తుంది. పశువుకు రూ.30వేల బీమా చేస్తే రూ.960 రైతు, మరో రూ.960 ప్రభుత్వం చెల్లిస్తుంది. మూడేళ్లలో పశువులు మృత్యువాత పడితే బీమా మొత్తం అందుతుంది. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఒక కుటుంబానికి సంవత్సరానికి 50 జీవాల వరకు పశుబీమా వర్తిస్తుంది. 6నెలలు ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలకు రూ.6వేలు బీమా ప్రభుత్వం చెల్లిస్తుంది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీ ఇస్తుంది. సంవత్సరానికి రూ.36 పెంపకందారు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. దారిద్రరేఖకు ఎగువన ఉన్న లబ్ధిదారులకు 50శాతం బీమా ప్రీమియం ప్రభుత్వం భరిస్తుంది. సంవత్సరానికి రూ.90, మూడేళ్లకు రూ.188 చెల్లిస్తే సరిపోతుంది.

దగ్గరలోని పశువైద్యశాలలో రైతులు పశువులకు బీమా చేయించుకోవచ్చు. ప్రస్తుతం మేలు జాతి పశువుల ధర రూ.లక్ష వరకు ఉంది. ప్రభుత్వం రూ.30వేలు మాత్రమే బీమా వర్తింప చేస్తుంది. అదనంగా రూ.లక్ష వరకు బీమా కావాలంటే అధికంగా ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. పశువు విలువలో 6.4 శాతం ప్రీమియం చెల్లించాలి. బీమా ప్రీమియం చెల్లించిన పశువు చెవికి ట్యాగ్ వేస్తారు. పశువు చనిపోయినప్పుడు చెవిట్యాగ్ ఆధారంగా బీమా చెల్లిస్తారు. బీమా చేయించుకోవడానికి రైతులు ఆదార్‌కార్డు, బ్యాంకుపాస్‌బుక్, తెల్లరేషన్‌కార్డును తీసుకెళ్లాల్సి ఉంటుంది.

ప్రతి పశువుకు బీమా చేయించండి

పశు పోషకులు ప్రతి పశువుకు బీమా చేయించాలి. పశువులు మృత్యువాత పడితే రైతు ఆర్థిక నష్టం లేకుండా ప్రభుత్వం పశుబీమా పథకం తీసుకొచ్చింది. ఆయా వర్గాల వారీగా 80శాతం, 50శాతం బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది. స్వల్ప ప్రీమియంతో మూడేళ్ల పాటు బీమా ఉంటుంది ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

గోవిందరాజు, జేడీ పశు సంవర్థక శాఖ

ఏలూరు జిల్లాలో పశువుల సంఖ్య	
ఆవులు	1,35,607
గేదెలు	5,06,110
గొర్రెలు	5,26,836
మేకలు	1,98,810





ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద, కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరీక్ష కేంద్రం వద్ద పదో తరగతి విద్యార్థులు

ప్రశాంతంగా పది పరీక్షలు

ముదినేపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ముదినేపల్లి మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంమభయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు 99.2 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఏడు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 632 మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరైనట్టు ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు. ముదినేపల్లి హైస్కూలు పరీక్ష కేంద్రంలో నూరుశాతం హాజరు కావడం విశేషం. చిగురుకోట, అల్లూరు హైస్కూలు విద్యార్థులకు పెదగొన్నూరు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. తహసీల్దార్ సుభానీ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

కైకలూరు : మండలంలో ఆరు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు జరిగాయి. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భాష్యం స్కూల్, శ్రీచైతన్య, హోలీక్రాస్, గర్ల్స్‌హైస్కూల్, భుజబల పట్నంలోని జడ్పీ హైస్కూల్లో పరీక్షా కేంద్రాలను నిర్వహించారు. మొత్తం 935 మందికి 919 మంది హాజరయ్యారు. 16 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో రామారావు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలు చేశారు.

కలిదిండి : మండలంలో మొత్తం 835 మంది విద్యార్థులకు గాను 825 మంది హాజరయ్యారు. కోరుకొల్లు, కలిదిండి, ఆరుతెగలపాడు, భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 9 గంటలకల్లా విద్యార్థులు చేరుకున్నారు.



చెక్కపల్లిలో టెన్త్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్



నూజివీడు బాలికోన్నత పాఠశాల సెంటర్‌ను తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ సత్య శ్రీనివాస్

మండవల్లి : మండవల్లి జడ్పీ హైస్కూల్లో తొలి రోజు 239 విద్యార్థులకు గాను 221 మంది హాజరయ్యారు. 18మంది గైర్హాజరు అయ్యారని ఎంఈవో-1 రామారావు తెలిపారు.

ముసునూరు : మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు 12మంది గైర్హాజరయ్యారు. ముసునూరులో 194మందికి 190 మంది, గోపవరంలో 120మందికి 118మంది, చెక్కపల్లిలో 280మందికి 274మంది హాజరయ్యారు. మొత్తం 594 మంది విద్యార్థులకు 582మంది హాజరు కాగా 12మంది గైర్హాజరైనట్టు ఎంఈవో సుబ్బారావు తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, తాడేపల్లిగూడెం డీవైఈవో, స్క్వాడ్ రవీంద్రభారతి తనిఖీ చేశారు.

చాట్రాయి : చాట్రాయిలో తొమ్మిది మంది గైర్హాజరైనట్లు ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు. ఆర్సీఎం స్కూల్‌లో, 162 మందికి 7 గురు, జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 278 మందికి 275 మంది పరీక్షలు రాశారు. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో రెండు సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

నూజివీడు టౌన్ : నూజివీడు డివిజన్ పరిధిలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. డివిజన్ పరిధిలో ఆరు మండలాల్లో మొత్తం 30 పరీక్షా కేందాలను ఏర్పాటు చేయగా, 5,449 మంది విద్యార్థులకు గాను 5,298 మంది విద్యార్థులు తొలిరోజు తెలుగు పరీక్షకు హాజరైయ్యారని డీవైఈవో సేవియా తెలిపారు. నూజివీడు పట్టణ పరిధిలోని పరీక్షా కేంద్రాలను డీవైఈవోతో పాటు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ తనిఖీ చేశారు.



ముసునూరు పరీక్షా కేంద్రంలో..



చాట్రాయిలో పరీక్ష కేంద్రంలో హాజరైన విద్యార్థులు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్యామలాంబ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, హుండీల మొక్కుబడి ఆదాయం రూ.3,25,612 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేఖర్ తెలిపారు. సోమవారం కైకలూరు శ్యామలాంబ, రామలింగేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో హుండీ ఆదాయం లెక్కింపును గుడివాడ ఎండోమెంట్ తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించారు. శ్యామలాంబ అమ్మవారికి 132 రోజులకు రూ.3,25,612, రామలింగేశ్వర స్వామికి 178 రోజుల్లో రూ.48,9247, వేంకటేశ్వరస్వామికి 178 రోజులకు రూ.1,64,099 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.



విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం రవిశంకర్

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

కైకలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ రోజు దాత సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు హెచ్‌ఎం రవిశంకర్ తెలిపారు. కైకలూరు మండలం వదర్లపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన వడుపు శ్రీనివాసరావు వేసవి సెల వులు ఇచ్చేవరకు ప్రతీ రోజు విద్యార్థులకు మధ్యాహ్న సమయంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

కంప్యూటర్ల బహూకరణ

ఉంగుటూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : కైకరం హైస్కూల్లో పూర్వ విద్యార్థి సనపల రామకృష్ణారావు కిట్స్ సంస్థ తరపున రూ.35 లక్షల విలువైన 35 కంప్యూటర్లు 5 ల్యాప్ ట్యాప్‌లు అందజేశారు. బాలికా విద్యను ప్రోత్సహించడం తనకు సంతోషంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

మే 7 నుంచి త్రిపుల్ ఐటీకి సెలవులు

నూజివీడు టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లకు మే 7 నుంచి వేసవి సెలవులు ఇస్తున్నట్టు డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు మే 7న పరీక్షలు ముగుస్తున్నందున సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసుకుని క్యాంపస్ నుంచి వెళతారని, సెమిస్టర్లలో ఉత్తీర్ణులకు వేసవిలో రెమిడియల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వేసవి సెలవుల్లో ఆన్‌లైన్ సమ్మర్ ప్రాసెస్ నిర్వహించడం జరుగుతుందని, విధివిధానాలను త్వరలో నిర్ణయించనున్నట్లు ఆయన తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బ్రాంచ్ ఓరియంటేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుందని, తర్వాత సెలవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో తిరిగి జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అమరేంద్ర కుమార్ తెలిపారు.



ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థల ముఖద్వారం



రమణక్కపేటలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న సిస్టర్స్

మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి : మెటిల్లా

ముసునూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే హోలీ ఫ్యామిలీ సంస్థ లక్ష్యమని సుపీరియల్ సిస్టర్ మెటిల్లా అన్నారు. హోలీ ఫ్యామిలీ సంస్థలో కుట్టుమిషన్ శిక్షణ పొందిన 20 మహిళలకు ఫాదర్ ఆనందబాబు, ఫాదర్ కుమార్‌రాజా కుట్టుమిషన్‌లు, డిప్లొమా సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. టైలరింగ్ ఇన్‌చార్జులు సిస్టర్ మిల్‌రేడ్, టీచర్ మేరీ, సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సారా కేసులో నలుగురి అరెస్ట్

చాట్రాయి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సారా కేసుల్లో నలుగురిని సోమవారం అరెస్ట్ చేసి తిరువూరు కోర్టులో హాజరుపర్చినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. బూరుగుగూడెంలో మల్లెల్లి సత్యవతి వద్ద ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

కనీస వేతనం చెల్లించాలి

ఏలూరు రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి) : స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం 15 వేల రూపాయలివ్వాలని స్కూలు శానిటేషన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.దుర్గ, కార్యదర్శి కె.విజయలక్ష్మి, నాయకులు ఎన్.విజయలక్ష్మి, పి.రమణమ్మ మాట్లాడుతూ తమ ఆర్థిక ఇబ్బం దులను గుర్తించి సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. వీరి ఆందోళనకు గౌస్య, సబేర, కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా నాయకులు బి.సోమయ్య, ఎం.దుర్గా రావు సంఘీభావం తెలిపారు.

ఉపాధి కూలీలకు గాయాలు



చాట్రాయి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో సోమవారం ఉపాధి పనికి వెళుతున్న ఇద్దరు కూలీలు వేర్వేరు సంఘటనల్లో గాయపడ్డారు. మోటార్ సైకిల్‌పై వెళుతున్న అంగడాల శ్రీనివాసరావు అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. ఎన్నెస్పీ కాలువ నుంచి పైకి ఎక్కుతున్న గోలుకొండ సత్యవతి జారిపడి గాయపడ్డారు. వారికి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవు

నూజివీడు టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ నాగ మురళి హెచ్చరించారు. నూజివీడులో వాహనాలు సోమవారం తనిఖీ చేశారు. అనంతరం రవాణాశాఖ కార్యాలయం వద్ద పాఠశాల బస్సులు, ఇతర వాహనాల డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. బస్సులు ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచాలని, పర్మిట్లు, ఓవర్‌లోడ్ విషయాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. తనిఖీలలో 15 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంవిఐలు కృష్ణవేణి, అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.



ముసునూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రాజు

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి

ముసునూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం ముసునూరులో ఉపాధి కూలీలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి కూలీకి 200 రోజుల పనిదినాలను కల్పించి, సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. పని జరిగే ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, మంచినీరు, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. కూలీలకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని ఆయన కోరారు.

తెలుగు యూనివర్సిటీ పేరు మార్చడం తగదు



ఎం.నాగరాణి

నూజివీడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరుమార్చడం తగదని బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి తీవ్రంగా ఖండించారు. పొట్టి శ్రీరాములు పేరు తొలగించాలనే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం అమరజీవిని అవమానించడమేనన్నారు. కేవలం రాజకీయ స్వలాభం కోసం తెలంగాణ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని పొట్టిశ్రీరాములు పేరును కొనసాగించాలని నాగరాణి డిమాండ్ చేసారు. బీజేపీ నాయకులు బోను అప్పారావు, వైఎస్ దొర్రై, ఎం రాజశేఖర్, మాటూరి రవికాంత్, శివరాజు, వసుందరాదేవి, మాగంటి వాసు, భావరాజు, పుల్లారావు, జగదీష్ తదితరులు తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం, సోమవరం సబ్ స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంజయ్ తెలిపారు. రైతులు వినియోగదారులు సహకరించాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 102, 112
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475